ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
కడప
జిల్లా వార్తలు
5
సోమవారం 20 మే 2024





రెమ్యూనరేషన్ ఏది..?

- పోలింగ్ ముగిసి వారమైనా.. అందని పారితోషికం
- కార్యాలయాల చుట్టూ తిరుగుతున్న సిబ్బంది
- బీఎల్‌వోల పరిస్థితి మరీ దారుణం
- ఏళ్ల తరబడి అందని అలవెన్స్

కడప (ఎన్టీఆర్ సర్కిల్), మే 19: ఒక పక్క బారులు తీరిన ఓటర్లు.. మరో పక్క మొరాయిస్తున్న ఈవీఎంలు. వెంటనే మరమ్మత్తులు చేసి ఓటింగ్ ప్రారంభించాలని పోలింగ్ సిబ్బందికి ఒత్తిళ్లు.. ఆగమేఘాల మీద సమస్య ఉన్న పోలింగ్ కేంద్రాలకు వెళ్లి సాంకేతిక సమస్యలను పరిష్కరించి పోలింగ్ ప్రారంభమయ్యేలా సహకరించిన రూట్ ఆఫీసర్లు, టెక్నికల్ అధికారులు.. వీరంతా ఎన్నికల సమరంలో కత్తిమీద సాములా తీవ్ర ఒత్తిళ్ల మధ్య విధులు నిర్వహించారు. అయితే వీరికి ఎన్నికల విధులకు సంబంధించి పారితోషికం ఇవ్వడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని పలువురు వాపోతున్నారు. రిటర్నింగ్ అధికారులను అడిగితే తహసీల్దార్లను అడగమంటున్నారని.. వారు తమకు సంబంధం లేదన్నట్లు ఉన్నారని కొంత మంది సిబ్బంది ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఎన్నికలు అయిపోయి వారం రోజులు దాటినప్పటికీ పారితోషికానికి కొంతమంది ఎన్నికల సిబ్బంది కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. అయినప్పటికీ ఎప్పుడు ఇస్తారు, ఎంత ఇస్తారు అనేది కూడా స్పష్టం కాకపోవడంతో ప్రతిరోజూ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. ఎన్నికలు అయిపోగానే పోలింగ్ సిబ్బందికి పారితోషికం పంపిణీ చేయడం జరుగుతుంది. జిల్లాలోని ఎనిమిది నియోజకవర్గాల్లో ఈ నెల 13న పోలింగ్ నిర్వహించారు. జిల్లాలోని 16,39,066 మంది ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకునేందుకు 2035 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. వీటి నిర్వహణ కోసం ఒక్కో కేంద్రానికి ఒక పీవో, ఏపీవోతో పాటు నలుగురు చొప్పున సిబ్బందిని కేటాయించారు. వీరికి ఎన్నికల కమిషన్ పారితోషికం ఇచ్చింది.

ఇచ్చిన పారితోషికంలో అసమానతలు

ఎన్నికల కమిషన్ పోలింగ్ సిబ్బందికి ఎవరికి ఎంత ఇవ్వాలనేది ఫిక్స్ చేసిందనేది సమాచారం. కానీ రాష్ట్రంలో ఒక్కో జిల్లాలో ఒక్కో రకంగా రెమ్యునరేషన్ పంపిణీ చేశారు. తెలంగాణ రాష్ట్రంలో పోలింగ్ ఆఫీసర్లకు రూ.3150 ఇవ్వగా, ఓపీవోలకు రూ.1750, బీఎల్‌ఓ, ఓఎస్‌లకు రూ.600 ఇవ్వడం జరిగింది. ఇక మన రాష్ట్రంలోనే పక్క జిల్లాలో ఉన్న తాడిపత్రిలో పీవో, ఏపీవోలకు రూ.2050 ఇవ్వగా పోలింగ్ సిబ్బందికి రూ.1300 ఇవ్వడం జరిగింది. అయితే పక్క రాష్ట్రంలో మాదిరిగా పోలింగ్ సిబ్బందికి అందరికీ ఇచ్చినట్లు కాకుండా మన రాష్ట్రంలో కేవలం పీవోలు, ఓపీవోలకు మాత్రమే పారితోషికం ఇవ్వగా... ఇతర సిబ్బందికి ఇచ్చిన దాఖలాలు లేవు. వీరిలో కొంత మంది రూట్ ఆఫీసర్లుగా విధులు నిర్వహించారు. ఈవీఎంలలో ఎక్కడైనా సాంకేతిక సమస్యలు ఉత్పన్నమైతే వెంటనే వీరు వెళ్లి పరిష్కరించేవారు. వీరికి కూడా ఇప్పటి వరకు పారితోషికం అందకపోవడంతో ఎవరిని అడగాలో దిక్కు తెలియక ఇబ్బంది పడుతున్నారు.

బీఎల్‌వోల పరిస్థితి మరీ దారుణం

బూత్‌స్థాయి అధికారులపై ఎన్నికల అధికారుల తీరు మరీ దారుణంగా కనిపిస్తుంది. పని చేయించుకుని పైసా కూడా ఇవ్వకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నట్లు తెలుస్తుంది. ఓటరు జాబితా మొదలుకుని పోలింగ్ కేంద్రాల్లో వసతుల కల్పన, ఓటర్ల స్లిప్పులు పంపిణీ, ఇంటింటి సర్వే ఇలా అనేక కీలక పనులు చేస్తున్న బీఎల్‌వోల పట్ల కనికరం చూపడంలేదు. బీఎల్‌వోలకు కూడా నిర్దేశిత మొత్తాన్ని చెల్లించాలని ఎన్నికల సంఘం ఆదేశించినప్పటికీ వారికి పైసా కూడా ఇవ్వకపోవడం దారుణం. జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో 2335 మంది బీఎల్‌వోలు పనిచేస్తున్నారు. వీరందరూ గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులే. ఉద్యోగ బాధ్యతలు నిర్వహిస్తూనే అదనంగా బీఎల్‌వోలుగా పనిచేస్తు న్నారు. ప్రతి సంవత్సరం ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమం జరుగుతుంది. మధ్యలో ఎన్నికలు వస్తే అదనపు భారమే. గత ఏడాది ఎమ్మెల్సీ ఎన్నికలు జరిగాయి. తాజాగా సార్వత్రిక ఎన్నికలు జరిగిన సంగతి తెలిసిందే. ప్రతి బీఎల్‌వోకు నెలకు రూ.500 చెల్లించాల్సి ఉంది. వైసీపీ ప్రభుత్వం వచ్చినప్పటి నుండి ఇప్పటి దాకా ఒక్కో బీఎల్‌వోకు రూ.30వేల వరకు బకాయిలు రావాల్సి ఉంది. దాదాపు రూ.6 కోట్ల 10 లక్షలు రాష్ట్ర ప్రభుత్వం చెల్లించాల్సి ఉంది.

పలువురు అధికారుల చేతివాటం

ఎన్నికల నిధులు ఖర్చు చేయడంలో కొంత మంది అధికారులు తమ చేతి వాటాన్ని ప్రదర్శిస్తూ సొమ్ము చేసుకుంటున్నారనే గుసగుసలు వినిపిస్తున్నాయి. కొన్ని చోట్ల బీఎల్‌వోల పేరు చెప్పి కూడా అధికారులు సొమ్ము నొక్కుతున్నట్లు తెలుస్తోంది. ఎన్నికల ఖర్చుకు సంబంధించి ఎటువంటి ఆడిట్ లేకపోవడంతో చేతి వాటం ప్రదర్శించే వారికి కలిసి వస్తోంది. బీఎల్‌వోలకు పారితోషికం చెల్లించాలని ఎన్నికల కమిషన్ ఉత్తర్వులు ఉన్నప్పటికీ జిల్లాలో దాదాపుగా ఎక్కడా అమలు కానట్లు తెలుస్తోంది.

కడప.. ఇది ఉమ్మడి రాష్ట్రంలోనే ఓ ప్రత్యేకమైన ప్రాంతం. ఒకప్పుడు ఫ్యాక్షన్‌కు అడ్డాగా ఉండేది. ఈ సారి సీఎం జగన్ సొంత అడ్డా. అయితే ఐదేళ్ల జగన్ పాలనలో వారిపై ఉన్న అభిప్రాయం మారిపోయిందంటారు. జగన్ సీఎం అయితే కడపలో పరిశ్రమలు, అభివృద్ధి జరుగుతుందంటూ జిల్లా వాసులు కలలుగన్నారు. అందుకు తగ్గట్లుగానే 2019లో ఫ్యానుకు ఓట్లేశారు. అయితే ఐదేళ్ల తరువాత క్షేత్రస్థాయిలో పరిస్థితులు అర్థమయ్యాయి. అందుకే నిన్న వైసీపీకి హార్డ్‌కోర్‌గా ఉండేవారిలో చాలా మంది టీడీపీ వైపు చూశారు. దీన్ని సహించలేకనే వైసీపీ దాడులకు తెర లేపిందంటారు. నిన్నటి వరకు మా అడ్డాలో ఉన్న కాలనీలు, పల్లెలు ఇప్పుడు టీడీపీ పరం కావడం భరించలేక ఎన్నికల రోజున విధ్వంసానికి పాల్పడ్డారనే ప్రచారం ఉంది.



చేతులు కాలాక.. ఆకులు పట్టుకున్నారు

- ఎన్నికల ప్రచారంలో టీడీపీపై వైసీపీ అండ్ కో దాడులు
- జమ్మలమడుగు, ప్రొద్దుటూరులో ఘర్షణలు
- ఈసీ ఆదేశాలతో సర్దుకుంటున్న పోలీసులు
- ఓ పక్క ఉడతా భక్తి చాటుతూ టీడీపీ శ్రేణులపై కేసులు



(కడప-ఆంధ్రజ్యోతి): జిల్లాలో కడప, జమ్మలమడుగు, ప్రొద్దుటూరు నియోజకవర్గాలు అత్యంత కీలకంగా మారాయి. ఇక్కడనే ఫ్యాక్షన్ గ్రామాలు ఉన్నాయి. అయితే ప్రతి ఎన్నికల్లో ఆ గ్రామాల్లో వన్‌సైడ్‌గా పోటీ నిలిచేది. అయితే ఈ సారి ఎన్నికల్లో కూడా ఆధిపత్యం కోసం టీడీపీ, వైసీపీలు గొడవలకు దిగి కేసులు నమోదు చేసుకోవడం గమనార్హం. కడప అసెంబ్లీలో టీడీపీ నుంచి ఆర్.మాధవీరెడ్డి, వైసీపీ నుంచి సిట్టింగ్ ఎమ్మెల్యే అంజద్‌బాషా పోటీ చేస్తున్నారు. మాధవీరెడ్డిని ఎనిమిది నెలల క్రితం ఇన్‌చార్జ్‌గా నియమించింది. అయితే ఆమె కాలికి బలపం కట్టుకున్నట్లుగా విస్తృతంగా పర్యటించారు. వైసీపీకి ధీటుగా నిలబడ్డారు. ఇక ప్రొద్దుటూరులో మాజీ ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి సిట్టింగ్ ఎమ్మెల్యే రాచమల్లుపై పోటీ చేశారు. కమలాపురం నుంచి టీడీపీ నుంచి చైతన్యరెడ్డి, వైసీపీ నుంచి సిట్టింగ్ ఎమ్మెల్యేగా రవీంద్రనాథరెడ్డి, బద్వేలులో సిట్టింగ్ ఎమ్మెల్యే సుధ, కూటమి నుంచి బొజ్జ రోశన్న, జమ్మలమడుగు నుంచి సిట్టింగ్ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి, పులివెందుల నుంచి సీఎం జగన్, టీడీపీ నుంచి బీటెక్ రవిలు పోటీ లో తలపడ్డారు.

జిల్లాలో కొద్ది నెలల నుంచి పలు పోలీసులు, వైసీపీకి తొత్తులుగా మారారనే ఆరోపణలు ఉన్నాయి. వైసీపీ దయాదాక్షిణ్యాలతోనే కీలకమైన పోస్టులు పట్టారనే విమర్శ ఉంది. కడప డీఎస్పీ షరీఫ్ వైసీపీకి భక్తుడిగా పేరొందారంటారు. ఇక టూటౌన్ సీఐ వైసీపీకి వీర విధేయుడు అంటారు. లోకేశ్ చేపట్టిన యువగళం పాదయాత్రలో ప్రొద్దు టూరులో ఇబ్రహీం ఇబ్బందులు పెట్టారు. అప్పట్లో వీరిపై లోకేశ్ సీరియస్ అయ్యారు.

వైసీపీకి తొత్తుగా పోలీసులు

ముఖ్యమంత్రి నియోజకవర్గంలో సార్వత్రిక ఎన్నికలు చాలా కీలకంగా మారనున్నాయి. ఎందుకంటే ఇక్కడ వార్ ఒకప్పటిలా వన్‌సైడ్‌కాదు. క్షేత్రస్థాయిలో పరిస్థితి ఏందో పోలీసులకు తెలుసు. అయితే పోలింగ్ రోజున పలువురు పోలీసులు తమకేమీ పట్టనట్లు ఉండ డంపై తీవ్ర విమర్శలు వస్తున్నాయి. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు పోలింగ్ రోజు వైసీపీకి తొత్తుగా వ్యవహరించిన అధికారుల్లో ఇప్పుడు భయం మొదలైంది. జిల్లాలో కడప, పులివెందుల, ప్రొద్దుటూరు, జమ్మలమడుగు, మైదుకూరు, కమలాపురం చాలా ఉద్రిక్తతలు చోటు చేసుకునే నియోజకవర్గాలు. అయితే ఈ ప్రాంతాల్లో కొందరు పోలీసులు వన్‌సైడ్‌గా వ్యవహరించారనే ఆరోపణలు ఉన్నాయి. వైసీపీ బ్యాచ్ దాడులు చేస్తున్నా పట్టించు కోలేదంటారు.

టీడీపీ నేతలపై కేసులు నమోదు

కడప నగరంలో టీడీపీ ఇన్‌చార్జ్ మాధవీరెడ్డి విస్తృతంగా ఇంటింటికీ ప్రచారం నిర్వహిం చారు. అయితే ఎన్నికలు దగ్గరపడే రోజు ఏదోరకంగా వైసీపీ నేతలు దాడులకు పాల్పడే వారంటారు. వైసీపీ అండ్ కో సోషల్ మీడియాలో మాధవీరెడ్డిపై నీచంగా ట్రోల్ చేసినా కూడా ఆమె ఆత్మస్థైర్యం కోల్పోకుండా ఇంటింటికీ వెళ్లేవారు. అయితే పోలింగ్ రోజు గౌస్‌నగర్‌లో డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, ఆయన తమ్ముడు అహ్మద్‌బాషా ఇటు టీడీపీ నేతలతో జరిగిన గొడవ తీవ్ర ఉద్రిక్తతలకు దారి తీసింది. గౌస్‌నగర్ ఏరియా అంతా ఒక రణరంగంగా మారంది. ఇరువర్గాలు రాళ్ల దాడులు చేసుకోవడంతో ఏం జరుగుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. ఒక పక్క శ్రీనివాసరెడ్డి, మరో పక్క డిప్యూటీసీఎం అనుచరుడు పోటాపోటీగా నిలబడ్డారు. ఇరువర్గాలు రా అండ్ రా అంటూ సవాల్ విసిరారు. డిప్యూటీ సీఎం అంజద్‌బాషా తొడకొట్టి సవాల్ విసిరారు. ఈసీ దెబ్బతో జగన్ సీఎం అయినప్పటి నుంచి జిల్లాలో వైసీపీ సెక్షన్‌లే అమలవుతాయంటారు. ఎవరు వచ్చినా కూడా డిప్యూటీ సీఎంఅంజద్‌బాషా వారిపై కేసులు కట్టాలంటారు. అయితే ఎన్నికల తరువాత స్టేట్‌లో తీవ్రస్థాయిలో హింస జరిగింది. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఈ సారి పోలీసులు చర్యలు తీసుకుంటుండడం వైసీపీలో కలవరపాటుకు గురి చేస్తుంది. పోలింగ్ రోజున గౌస్‌నగర్‌లో టీడీపీ, వైసీపీ మధ్య జరిగిన ఘర్షణలో డిప్యూటీ సీఎం అంజజద్‌బాషా, పొలిట్‌బ్యూరో సభ్యులు శ్రీనివాసరెడ్డితో సహ పలువురిపై కేసులు నమోదు చేశారు. ఇక ప్రొద్దుటూరులో ఎన్నికల కమిషన్ సీరియస్‌గా ఉండడంతో పలు రోడ్‌షోలకు సీఐ స్టేషన్‌కు పిలిపించి కౌన్సిలింగ్ ఇచ్చే ప్రయత్నం చేయగా నామనుషులు తీసుకెళతావా, నేను తలుచుకుంటే ప్రొద్దుటూరును మరో తాడపత్రి చేస్తానని ఓ ఎమ్మెల్యే హెచ్చరించడం కలకలంగా మారింది. ఇక జమ్మలమడుగులో ఎమ్మెల్యేపై దాడి చేసిన కేసులో ఒకరిని అరెస్టు చేశారు. అయితే ఆదినారాయణరెడ్డి వాహనంపై చేసిన దాడిలో ఎవరిని అరెస్టు చేయలేదు.

పోలీసులు అలర్ట్

జిల్లాలో పలువురు పోలీసులు నిన్నటిదాకా వైసీపీకి వీర భక్తులుగా ఉండేవారు. ఐపీసీ చట్టం బదులు వైసీపీకి చెందిన చట్టాన్ని అమలు చేసేవారు. వైసీపీకి తొత్తుగా ఉండడం వల్లనే కడప, జమ్మలమడుగు, ప్రొద్దుటూరులో గొడవలు జరిగాయంటారు. కడపలోటీడీపీ అభ్యర్థిగా మాధవీరెడ్డిని ప్రకటించిన తరువాత ఆమె తనదైన స్టైల్‌లో జనాల్లోకి దూసుకెళ్లింది. అయితే ప్రతి చోటా డిప్యూటీ సీఎం అంజద్‌బాషా వర్గీయుల నుంచి నిరసన ఎదురైంది. అయితే వాటిన్నింటినీ అధిగమించింది. అందుకే పోలింగ్ రోజున గొడవ జరిగే అవకాశం ఉన్నప్పటికీ పోలీసులు పట్టించుకోలేదనే ఆరోపణలున్నాయి. గౌస్‌నగర్‌లో వైసీపీ రెచ్చగొట్టే ప్రయత్నం చేసిందంటారు. అయితే అప్పట్లో టీడీపీ నేతలు పట్టించుకోలేదంటారు. చివరికి గొడవ జరిగింది. అయితే ఈ గొడవలో వన్ టౌన్ సీఐ భాస్కర్‌రెడ్డి, ఎస్సైలు రంగస్వామి, తిరుపాలనాయక్, ఎర్రన్నమహ్మద్‌ఆలీఖాన్ ఇంకొకరికి చార్జి మెమోలు ఇచ్చారు. వీరంతా గౌస్‌నగర్‌లో జరిగిన గొడవకు , బందోబస్తు రాలేదని ఇచ్చారు. వాస్తవంగా అయితే వీరంతా ఎన్నికల విధుల్లో ఉన్నారు. వారి వారి ఏరియాల్లో సాయంత్రం 6 నుంచి పోలింగ్ పూర్తయింది. ఈవీయంలను నేరుగా స్ట్రాంగ్‌రూము పంపించే ఏర్పాట్లలో ఉన్నారు. సిబ్బంది అక్కడ బిజీగా ఉంటే గౌస్‌నగర్ గొడవకు రాలేదంటూ మెమోలు ఇవ్వడం చర్చనీయాంశంగా మారింది. మేం మాకు కేటాయించిన విధుల్లో పాల్గొన్నాం. గౌస్‌నగర్‌లో గొడవ జరుగుతున్న ఇష్యూ కానీ, మాకు ఎవరూ పైస్థాయి నుంచి అధికారులు ఫోను చేయలేదు సమాచారం ఇవ్వలేదు. అది ఎవరైతే వైసీపీ కొమ్ము కాశారని ప్రచారం ఉందో వారే ఆ డ్యూటీకి వెళ్లారనే ప్రచారం ఉంది. అయితే వాస్తవాలు పట్టించుకోకుండా కేసులు నమోదు చేయడం దారుణం, గౌస్‌నగర్ రోడ్డును డిప్యూటీ సీఎం అండ్ కో స్వాధీనం చేసుకుని రౌడీయిజం చేస్తున్నా అక్కడున్న పోలీసులు లైట్ తీసుకోవడం తీవ్ర విమర్శలకు తావిచ్చింది. అంజద్‌బాషా స్వయంగా తొడగొడుతూ రెచ్చగొట్టే విధంగా కవ్వింపు చర్యలు చేయడం కలకలం రేపింది. అయితే చివరికి పోలీసులు జోక్యం చేసుకుని పరిస్థితిని సద్దు మణిగించారు.

ఎన్నికల సంఘం ఆదేశాలతో..

ఎన్నికల సందర్భంగా జరిగిన గొడవలను పోలీసులు లైట్ తీసుకున్నారు. అయితే ఎన్నికల అనంతరం గొడవలు జరగడాన్ని కేంద్ర ఎన్నికల్ సంఘం సీరియస్‌గా తీసుకుంది. గొడవలకు కారకులైన వారిపై చర్యలు తీసుకోవాలని ఆదేశించింది. నిన్నటి దాకా వైసీపీకి కొమ్ముకాస్తున్న అధికారులకు ఈసీ ఆదేశాలు గొంతులో వెలక్కాయగా మారాయంటారు. అందుకే పోలింగ్ రోజున ఘర్షణ పడ్డ వారిపై కేసులకు ఉపక్రమించారంటారు. కడపలో గౌస్‌నగర్‌లో పోలింగ్ రోజున గొడవకు డిప్యూటీ సీఎం అంజద్‌బాషా కారణమని టీడీపీ ఆరోపిస్తోంది. అయితే ఈసీ ఆదేశాల మేరకు పోలీసులు డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, ఆయన తమ్ముడు అహ్మద్, అల్లుడిపై కేసు నమోదు చేశారు. పనిలో పనిగా వైసీపీకి ఉడతా భక్తి చాటుతూ టీడీపీ శ్రేణులపై కేసులు నమోదు చేయడం గమనార్హం.

డిప్యూటీ సీఎంను అరెస్టు చేయాలి..

ప్రశాంతంగా ఉన్న కడప నగరాన్ని అశాంతికి, రౌడీయిజానికి వైసీపీ నేతలు అడ్డాగా చేశారు. గౌస్‌నగర్‌లో గొడవలకు డిప్యూటీ సీఎం అంజద్‌బాషా కారణం. ఆయనను వెంటనే అరెస్టు చేయాలని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు శ్రీనివాసరెడ్డి డిమాండ్ చేశారు. పోలింగ్ రోజున గౌస్‌నగర్‌లో అంజద్ వర్గీయులే రెచ్చగొట్టారు. టీడీపీ శ్రేణులు సహనం పాటించారు. అయితే ఇప్పుడు తనతో పాటు టీడీపీ శ్రేణులపై కేసులు నమోదు చేయడం దుర్మార్గమన్నారు. ఎన్నికల కమిషన్ ఆదేశాలతో భయపడ్డ పోలీసులు ఇప్పుడు నామమాత్రంగా కేసులు నమోదు చేసి చేతులు దులుపుకుందామని చూస్తున్నారు. పోలీసులకు దమ్ముంటే డిప్యూటీ సీఎం అందజద్‌బషా కడపలో అశాంతి కి కారణమైన అహ్మద్‌బాషాలను అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు.

- శ్రీనివాసరెడ్డి, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు

మీకెంత ధైర్యం.. మా వాళ్లను స్టేషనుకు పిలిపిస్తారా

- సీఐ శ్రీకాంత్‌ను బెదిరించిన ఎమ్మెల్యే రాచమల్లు, మున్సిపల్ వైస్‌చైర్మన్ బంగారు మునిరెడ్డి
- విధులకు ఆటంకం కలిగించడంపై కేసు నమోదు

ప్రొద్దుటూరు, మే 19: మీకు ఎంత ధైర్యం ఉంటే.. నా మనుషులను స్టేషనుకు పిలిపిస్తారు.. అంటూ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ పాతకోట బంగారు మునిరెడ్డిలు వన్‌టౌన్ సీఐ శ్రీకాంత్ యాదవ్‌పై బెదిరింపులకు పాల్పడ్డారు. శనివారం ఉదయం వన్‌టౌన్ పోలీసు స్టేషన్‌లో జరిగిన ఈ ఘటనపై సీఐ శ్రీకాంత్ యాదవ్ ఫిర్యాదు మేరకు ఎమ్మెల్యే, వైస్ చైర్మన్‌తో పాటు వారి అనుచరులు కుండా రవి, ద్వార్శల గురునాథరెడ్డిలపై కేసు నమోదు చేసినట్లు డీఎస్పీ మురళీధర్ తెలిపారు. వివరాల్లోకి వెళితే..

ఎన్నికల ఫలితాలు వెలువడే వరకు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు చేపట్టాలని శనివారం జిల్లా పోలీసు ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు పోలీసులు కౌన్సెలింగ్ చేపట్టా రు. ఇందులో భాగంగా వన్‌టౌన్ పరిధిలో శాంతి భద్రతలకు విఘాతం కలిగించే ట్రబుల్ మాంగర్స్, రౌడీషీటర్లను పోలీసుస్టేషనకు పిలిపించి సీఐ శ్రీకాంత్‌యాదవ్ కౌన్సెలింగ్ ఇచ్చారు. రామేశ్వరానికి చెందిన మార్తల నవీన్ కుమార్ రెడ్డి అనే వ్యక్తి ఆ ప్రాంతంలో ప్రత్యర్థి పార్టీలకు చెందిన వ్యక్తులను దూషిస్తూ కవ్వింపు చర్యలకు పాల్పడుతున్నట్లు వచ్చిన సమాచారం మేరకు అతడిని స్టేషనుకు సీఐ పిలిపించారు. ఎలాంటి కవ్వింపు చర్యలకు పాల్పడకూడదని కౌన్సెలింగ్ ఇస్తుండగా.. ఉదయం 10.30 గంటలకు ఎమ్మెల్యే రాచమల్లు, బంగారు మునిరెడ్డిలు వారి అనుచరులు కుండా రవి, ద్వార్శల గురునాథరెడ్డిలతో పోలీసుస్టేషనుకు వచ్చారు. మీకు ఎంత ధైర్యం ఉంటే నా కార్యకర్తలను స్టేషనుకు పిలిపిస్తారు అంటూ సీఐని బెదిరించి.. విధులకు ఆటంకం కలిగిస్తూ.. నవీన్‌కుమార్‌రెడ్డిని బలవంతంగా స్టేషను నుంచి తమ వెంట తీసుకెళ్లారు. జరిగిన ఘటనపై సీఐ శ్రీకాంత్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు వన్‌టౌన్‌లో కేసులు నమోదు చేశామని, తదుపరి విచారణ జరుగుతుందని డీఎస్పీ మురళీధర్ తెలిపారు. ప్రొద్దుటూరులో శాంతిభద్రతలకు భంగం కలిగించే ఎంతటి వారినైనా ఉపేక్షించమని, కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.



కాపు లేదు.. ధర లేదు



పండ్లలోనే రారాజుగా పేరున్న మామిడి రైతు కంట కన్నీరు తెప్పిస్తోంది. నిన్నమొన్నటి వరకు టన్ను రూ.80వేలు పలికిన మామిడి ధరలు ఒక్కసారిగా రూ.30వేలకు పడిపోయాయి. ఈ ఏడాది దిగుబడి దయనీయంగా ఉంది. దీనికి తోడు మూలిగేనక్కపై తాటికాయ పడ్డ చందంగా ధర లేకపోవడం అన్నదాతలను తీవ్ర ఆవేదనకు గురిచేస్తోంది. దళారుల దెబ్బకు మామిడిధర పతనమైందని రైతులు గగ్గోలు పెడుతున్నారు.

- మొన్నటి వరకు టన్ను రూ.80వేలు, నేడు రూ.30వేలు
- బహిరంగ మార్కెట్‌లో కేజీ రూ.100, రైతుల వద్ద రూ.30
- దళారుల దెబ్బకు కుదేలైన మామిడిరైతు

చిలేకాంపల్లెలో అరకొరగా కాసిన మామిడిపంట



కాయలు లేని మామిడిచెట్లు

చక్రాయపేట, మే 19: చక్రాయపేట మండలం మామిడిసాగుకు పెట్టింది పేరు. సాగు గణనీయంగా ఉండడంతో వ్యాపారం కూడా కోట్లలో సాగుతూ వచ్చింది. ఒక చక్రాయపేట మండలమే కాకుండా లక్కిరెడ్డిపల్లె, రాయచోటి తదితర ప్రాంతాల నుంచి మామిడి పంటను చక్రా యపేటలోని షెడ్లలో ఏర్పాటు చేసిన మార్కెట్‌కు తెస్తారు. మార్కెట్‌లో యేడాదికి రూ. 150 కోట్ల నుంచి రూ.200 కోట్ల వరకు మామిడి వ్యాపారం సాగుతోంది. కానీ ఈ ఏడాది మామిడి దిగుబడి లేకపోవడంతో ధర అయినా ఉంటుందని రైతులు ఆశించారు. కానీ ధరలు కూడా పతనం కావడంతో రైతన్నలు కన్నీరుమున్నీరు అవుతున్నారు. మామిడి తోటలో చెట్లు కాయలు లేకుండా దర్శనమిస్తున్నాయి. తోటల్లో అక్కడక్కడ దిగుబడి వచ్చింది. వీటినైన అమ్మి సొమ్ము చేసుకుందామనుకుంటే ధర లేకపోవడం రైతులను కలచివేస్తోంది.

టన్ను రూ.80 వేల నుంచి రూ.30 వేలకు..

గత పది పదైదు రోజుల వరకు టన్ను మామిడి రూ.80వేలు పలికింది. ప్రస్తుతం చూస్తే రూ.30వేలకు పడిపోయింది. టన్ను రూ.80వేలతో రైతుల నుంచి కొను గోలు చేసేందుకు వ్యాపారులు అడ్వాన్స్‌లు సైతం ఇచ్చారు. ఒకరైతు పొలంలో మూడు నుంచి నాలుగు టన్నులు మామిడికాయలు దిగుబడి వస్తుందని వ్యాపారులు అంచనా వేసి రూ.10వేల నుంచి రూ.50వేల వరకు అడ్వాన్స్‌లు ఇస్తారు. అడ్వాన్స్‌ల ఇచ్చిన రోజు ఫలాన రోజున కాయలు కోస్తామని వ్యాపారులు చెప్పడం.. దాని ప్రకారం కాయలు కోసి, మార్కెట్‌కు తరలించడం జరుగుతుండేది. కానీ పది పదైదు రోజుల కిందట ఉన్న ధర ప్రకారం రైతుల నుంచి పంటకొని అడ్వాన్స్‌లు ఇచ్చారు. కానీ ధర పడిపోవడంతో అడ్వాన్స్ లను కూడా వదిలేసి ధర లేదని వ్యాపారులు చేతులెత్తేస్తున్నారు. దీంతో రైతు ఏం చేయాలో దిక్కుతోచని స్థితిలో పడిపోయారు. కనీసం మార్కెట్‌కు తీసుకెళ్లి అమ్ముదామ నుకుంటే దళారులు మరింత చేతివాటం ప్రదర్శిస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


నిలిచిపోయిన ఎగుమతులు

చక్రాయపేట మండలంలో ఏర్పాటు చేసిన మార్కెట్‌ల నుంచి మామిడి ప్రతి యేడాది బెంగుళూరు, హైదరాబాద్, పూనె, చెన్నై, అస్సాం, కేరళ తదితర రాష్ట్రాలకు ఎగుమతి చేస్తున్నారు. కానీ ఈ ఏడాది దిగుబడి లేకపోవడంతో ఎగుమతులు పూర్తిగా తగ్గిపోయాయి. దీంతో వ్యాపారం లేదని కల్లబొల్లి మాటలు చెబుతున్నారు. బహిరంగ మార్కె ట్‌లో మామిడిపండ్లు కేజీ రూ.100 ధర పలుకుతోంది. కానీ రైతు వద్ద మాత్రం రూ.30కు కొనడం ఏమిటో, ఇదెక్కడి న్యాయమని రైతులు ఆవేదన చెందుతున్నారు. బహిరంగ మార్కెట్‌లో రూ.100 ఉంటే రైతు వద్ద కనీసం రూ.70, రూ.80 అయినా వెచ్చించాలి కదా అంటున్నారు.



ఈ యేడాది వెలవెలబోతున్న షెడ్లు

పెట్టుబడులు కూడా దక్కని దుస్థితి..



ప్రతి యేడాది మామిడి పంట చేతికొచ్చే సమయానికి మంచి ధర ఉండడం, చెప్పుకొనే స్థాయిలో దిగుబడి ఉండేది. నాకున్న 5 ఎకరాలలో మామిడి పంట సాగుచేశాను. ప్రతియేడాది మామిడి దిగుబడి బాగుండేది. ధర టన్ను రూ.60వేల నుంచి రూ. 80వేలు, రూ.90వేలు పలికేది. కానీ ఈ యేడాది తోటలో మామిడి చెట్లకు పూత మాత్రం విపరీతంగా వచ్చింది. వాతావరణ పరిస్థితులు సరిగా లేకపోవడంతో వచ్చిన పూతంతా రాలిపోయింది. దిగుబడి మరీ దయనీయంగా వచ్చింది. వచ్చిన దిగుబడి అయిన మంచి ధర ఉంటే కాస్తో కూస్తో ఊరటగా ఉండేది. ధరలు లేకపోవడంతో ఏం చేయాలో అంతుబట్టడం లేదు.

- జలంధర్‌రెడ్డి, రైతు, గొట్లమిట్ల, చక్రాయపేట మండలం

సమాజంలో వివక్షను పారద్రోలాలి

- డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ నాగరాజు

కడప(కలెక్టరేట్), మే 19: సమాజంలో వివక్షను ఎదుర్కొనే వారందరూ సంఘటితం కావాలనీ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ నాగరాజు పిలుపునిచ్చారు. ఆదివారం అంతర్జాతీయ కొవ్వొత్తుల సంస్మరణ దినం సందర్భంగా హెచ్‌ఐవీ, ఎయిడ్స్‌తో మృతి చెందిన కుటుంబాలకు వైద్యశాఖ అధికారులు సిబ్బంది సంఘీబావం తెలుపుతూ అంతర్జాతీయ కొవ్వత్తుల ర్యాలీ నిరహించారు ఈర్యాలీ డీఎంఅండ్‌హెచ్‌ఓ కార్యాలయం నుంచి ప్రారంభ మై ఐటీఐ సర్కిల్ గాంధీ విగ్రహం వరకు సాగింది. ఈసందర్భంగా డీఎంఅండ్ హెచ్‌ఓ మాట్లాడుతూ హెచ్‌ఐవీ, ఎయిడ్స్ నివారణకు అందరం చేయి చేయి కలపాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. డీఎల్‌ఏటీఓ డాక్టర్ రవిబాబు మాట్లాడుతూ హెచ్ ఐవీ, ఎయిడ్స్ బారిన పడకుండా ప్రతి ఒక్కరూ స్వీయ జాగ్రత్తలు పాటించాలన్నారు. కార్యక్రమంలో డీఐఓ డాక్టర్ ఉమామహేశ్వరకుమార్, జిల్లా ఉన్నతాధికారులు డాక్టర్ శశిభూషణ్ రెడ్డి, డీఎంఓ మనోరమ, డాక్టర్లు సునీత, ఉబేదుల్లా, గురవయ్య, ప్రసాద్‌రెడ్డి, జిల్లా ప్రోగ్రాం మేనేజరు వి.భాస్కర్, సూపర్‌వైజరు ప్రసాద్, సిబ్బంది, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు, తదితరులు పాల్గొన్నారు.



పూర్వ విద్యార్థుల సమ్మేళనం



పులివెందుల సరస్వతీ విద్యామందిరంలో పూర్వపు విద్యార్థులు

పులివెందుల టౌన్, మే 19: సరస్వతి విద్యామందిరం పాఠశాల 1999-2000 బ్యాచ్ విద్యార్థులు కలిశారు. ఆదివారం జరిగిన ఈ సమ్మేళనంలో 24ఏళ్ల తర్వాత అంతా కలుసుకోవడంతో సంతోషంగా గడిపారు. అప్పటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. అనంతరం గురువులను ఘనంగా సన్మానించారు. అందరు కలిసి విందులో పాల్గొన్నారు.

రెండు షాపుల్లో రూ.70 వేలు చోరీ



దుకాణాల్లో దొంగలు చోరీ చేస్తున్న దృశ్యం

రామాపురం, మే19: మూడు రోడ్ల కూడలిలో ఉన్న రెండు దుకాణాల తాళాలు పగులగొట్టి నగదు అపహరించుకు వెళ్లినట్లు ఎస్ఐ ప్రసాద్‌రెడ్డి తెలిపారు. శనివారం రాత్రి జరిగిన చోరీపై పోలీసుల కథనం మేరకు.. రామాపురం పోలీస్‌స్టేషన్‌కు కూత వేటు దూరంలో లక్కిరెడ్డిపల్లె క్రాస్ రోడ్డులో ఉన్న ఆర్ఎంపీ డాక్టర్ గంప వెంకట్రమణ మందుల షాపు, బాదుల్లా బేకరీ తాళాలను దుండగులు పగలగొట్టి చోరీకి పాల్పడ్డారు. ఈ రెండు దుకాణాల్లో దాదాపు రూ.70 వేల వరకు నగదు చోరీ చేసినట్లు బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీసీ కెమెరాల ఆధారంగా దొంగలను గుర్తిస్తామని పోలీసులు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వివరించారు.

విద్యుదాఘాతంతో మెకానిక్ దుర్మరణం

బి.కొత్తకోట, మే19: విద్యుదాఘాతంతో రామకృష్ణ(45) దుర్మరణం పాలయ్యాడు. ఆదివారం బి.కొత్తకోట మండలంలో చోటుచేసుకున్న సంఘటన వివరాల్లోకెళితే... పీటీఎం మండలం కాయలవాండ్లపల్లెకు వాసి రామకృష్ణ డిష్ పనులు చేస్తూ జీవిస్తున్నాడు. కాగా ఓబిరెడ్డిగారిపల్లెలో డిష్ వైర్లు రిపేరు చేస్తుండగా కరెంట్ షాక్ కొట్టింది. రామకృష్ణ అపస్మారక స్థితికి వెళ్లిపోయాడు. స్థానికులు బి.కొత్తకోట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అప్పటికే రామకృష్ణ మృతి చెందినట్లు వైద్యులు ధృవీకరించారు.

శాశ్వత జీఓ వచ్చేనా ?

రైతన్నల సమస్యలు పరిష్కారమయ్యేనా? ● చుక్కనీరు లేని పోరుమామిళ్ల చెరువు
నేతల మాటలు నేతిబీరకాయేనా? ● అధ్వాన్నంగా మారిన చెరువుకట్ట



ఎడారిని తలపిస్తున్న పోరుమామిళ్ల చెరువు

పోరుమామిళ్ల, మే 19: చారిత్రాత్మకమైన చరిత్ర కలిగిన పోరుమామిళ్ల చెరువుకు తెలుగుగంగ ద్వారా పూర్తిస్థాయిలో నీరందించి ఎల్లప్పుడూ నీరు నిల్వ ఉండేలా ప్రత్యేక జీఓ తెస్తామన్న నేతల మాటలు నీటిమూటలవుతున్నాయి. ఐదేళ్లకోమారు వచ్చే ఎన్నికల సమయాల్లో నేతల నోట ఇదే ప్రాచారాస్త్రం. తీరా ఓట్లు దండుకున్నాక దాని ఊసే ఎత్తకుండా నాయకులు వ్యవహరిస్తుంటారు. రైతన్నలు తమ ఆశలు అడియాశలేనా, అంటూ అయోమయంలో పడిపోతున్నారు. వివరాల్లోకెళితే....

బద్వేలు నియోజకవర్గంలో పోరుమామిళ్ల చెరువుకు ఎంతో చరిత్ర ఉంది. బ్రహ్మంసాగర్ ప్రాజెక్టు పూర్తయిన తరువాత పోరుమామిళ్ల చెరువును పూర్తి రిజర్వాయరుగా మార్చి 0.75 టీఎంసీల నీరు నిల్వ ఉంచి పోరుమామిళ్ల ప్రాంత రైతాంగానికి సాగునీరు అందిస్తామని ఐదేళ్లకోసారి చెబుతున్న హామీలు ఆచరణ శూన్య మే. ఏప్రభుత్వం అధికారంలోకి వచ్చి నా ఈ ప్రాంత ఎమ్మెల్యే ఎవరున్నా ప్రతిసారి నేతలు చెప్పే మాట పోరు మామిళ్ల చెరువును అధునీకరించి నీరు బ్రహ్మంసాగర్ ద్వారా నిల్వ ఉంచేలా శాశ్వత జీఓ తెస్తామని ఈ విషయం సీఎం దృష్టికి తెస్తామని ఎన్నో సార్లు వారు చెప్పిన మాటలు నీటిమూటలవుతున్నాయి. పోరుమామిళ్ల చెరువుకు సంబంధించి సాధారణ ఆయకట్టు అధికారికంగా 4వేలు ఉన్నా అనధికారికంగా ఈ చెరువుపై ఆధారపడి దాదాపు పదివేల ఎకరాల్లో రైతులు రబీ, ఖరీఫ్ పంటలను పండించేవారు. కొన్నిసార్లు వర్షాభావ పరిస్థితులు అతివృష్టి, అనావృష్టి కారణాలతో రైతులు నష్టపోయిన దాఖలాలు ఉన్నాయి. బ్రహ్మంసాగర్ నీరు పోరుమామిళ్ల చెరువు ద్వారా బద్వేలు వరకు ఉన్న చెరువులన్నీ నింపే అవకాశాలు కల్పించారే కానీ శాశ్వతంగా ఈ చెరువును ఆధునీకరించి నిల్వ ఉంచుదామనే దృఢమైన సంకల్పం పాలకుల్లో లేకుండాపోయింది. దీంతో అన్నదాతల ఆశలు అడి యాశలయ్యాయి. ఇటీవల ఎన్నడూలేని విధంగా పోరుమామిళ్ల మండలంలో చెరువులన్నీ ఎండిపోయి చుక్క నీరు లేకుండా పోయింది. పోరుమామిళ్ల, రంగసముద్రం సహా మిగిలిన గ్రామీణ ప్రాంత చెరువులు కూడా దాదాపు చుక్క నీరు లేని పరిస్థితి. దీంతో భూగర్భ జలాలు అడుగంటిపోయాయి. వ్యవసాయ బోర్లపై ఆధారపడి పంటలు సాగు చేసిన రైతులు కూడా నీరు అందని పరిస్థితి ఏర్పడింది. చాలా మంది రైతుల్లో తమ పంటలను నష్ట పోయారు. ముసల్‌రెడ్డిపల్లె ప్రాంతంలో దాదాపు 40 ఎకరాల వరకు పత్తి పైరు నీరందక ఎండు దశకు చేరిందని రైతులు వాపోతున్నారు. పోరుమామిళ్ల చెరువులో నీరు సమృద్ధిగా ఉంటే భూగర్భజలాలు పుష్కలంగా ఉంటాయని, వ్యవసాయ బోర్లు కూడా రీచార్జి అయ్యే అవకాశాలు ఉండేవని రైతులు చెబుతున్నారు. ప్రస్తుతం ఈ చెరువులో చుక్క నీరు లేకపోవడంతో దుక్కులు దున్ని ఖరీఫ్‌కు పంటలు సాగు చేసుకోవడానికి కూడా రైతులు ముందుకు రావాలన్నా ఆలోచించాల్సిన పరిస్థితి ఏర్పడింది. చెరువుకట్ట 1వ తూము నుంచి రెండో తూము వరకు కట్టకు ఇరువైపులా కంపచెట్లు పెరిగి కట్ట బలహీనపడుతుంది. సంబంధిత అధికారులు చెరువుకట్టపై ఉన్న కంపను తొలగించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. పోరుమామిళ్ల రైతాంగం సమస్యలు పూర్తిగా తీరాలంటే పోరుమామిళ్ల చెరువుకు శాశ్వత జీఓ తెచ్చి చెరువును ఆధునీకరించి ఫుల్ రిజర్వాయరుగా చేస్తే తాగు, సాగనీటికి ఇబ్బంది ఉండదు. అంతేకాక పోరుమామిళ్ల నుంచి బద్వేలుకు కాల్వల ద్వారా గంగ నీరు వెళుతున్నా ఎత్తైన ప్రదేశమైన సిద్ధవరం తదితర ప్రాంతాలకు నీరు వెళ్లలేని పరిస్థితి. ఆ ప్రాంతంలో లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా అయినా ఏర్పాటు చేస్తే గంగనీరు అందని రైతుల పొలాలకు లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా అయినా నీరందే అవకాశాలున్నాయని ఆ ప్రాంత రైతులు కోరుతున్నారు. ఎన్నికల ఫలితాలు వచ్చాక అయినా నేతలు రైతుల మీద కనికరం చూపి శాశ్వత జీఓ తెచ్చేందుకు కృషి చేయాలని రైతులు కోరుతున్నారు.



చెరువుకట్ట పై కమ్ముకున్న కంపచెట్లు

రిజర్వాయరైతే రైతాంగం సమస్య తీరుతుంది

20 ఏళ్లుగా పాలకులు ఎవరున్నా ముఖ్యమంత్రుల వద్దకు వెళ్లి శాశ్వత జీఓ తెస్తామని చెబుతున్నారే కానీ కార్యరూపం దాల్చిన దాఖలాలు లేవు. పోరుమామిళ్ల చెరువుకు శాశ్వత జీఓ వస్తే 0.75 టీఎంసీల నీరు నిల్వ ఉం టుంది. దీంతో సాగునీటికి నీరందడమే కాకుండా వ్యవసాయ బోర్లు కూడా రీఛార్జి అయ్యే అవకాశా లుంటాయి. ఇప్పటికైనా పాలకులు ఈ శాశ్వత జీఓ మీద దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

- కనుమర్లపూటి రామసుబ్బారావు, టీడీపీ జిల్లా మాజీ ఉపాధ్యక్షుడు

వేడుకగా పెంచలోరి ఉత్సవాలు ప్రారంభం

గోనుపల్లి నుంచి ఊరేగింపుగా కోనకు ఉత్సవమూర్తుల రాక ● గిరిజనవాడల్లో అంబరాన్నంటిన సంబరాలు
వైభవంగా అంకురార్పణ ● వేడుకగా స్వామివారికి శేషవాహన సేవ







గోనుపల్లి - కోనకు పల్లకీలో బయలు దేరిన స్వామి, దేవేరులు - గోనుపల్లిలో అత్తవారింట పూజలందుకుంటున్న స్వామి, అమ్మవార్లు - కోనలో స్వామి దేవేరుల ఊరేగింపు

రాపూరు(డక్కిలి), మే 19: రాపూరు మండలం గోనుపల్లి, గోనుపల్లి గిరిజనవాడలు ఆదివారం ఉదయం గోవింద నామస్మరణతో మార్మోగాయి. తప్పెట్లు, తాళాలు, గిరిజన నృత్యాలు, బాజాభజంత్రీల మధ్య ఉభయ దేవేరులతో కలిసి పెంచలస్వామి బ్రహ్మోత్సవాలు చేసుకునేందుకు గోనుపల్లిలోని అత్తారింటి నుంచి పెంచలకోనకు పయనమయ్యారు. గ్రామంలోని పెంచలోరి ఆలయం నుంచి పల్లకీలో చెంచులక్ష్మి అమ్మవారి ఇంటికి చేరుకున్నారు. కొత్త అల్లుడి రాకతో గోనుపల్లి గిరిజనవాడలో ఘనంగా సంబరాలు చేసుకున్నారు. ఇంటికి వచ్చిన అల్లుడికి గిరిజనులు తమ ఆచారం ప్రకారం పుట్టతేనె, ఇంజేటి గడ్డలు, నార మొలతాడును సారెగా ఇచ్చారు. గిరిజనవాడలోని ప్రతి ఇంటి వద్ద నేరేడు ఆకులతో పందిళ్లు వేసి, ఇంటి ముంగిట రంగవళ్లులు తీర్చిదిద్ది వధూవరులకు ఘనంగా స్వాగతం పలికారు. అత్తారింటికి చేరుకున్న వరుడిని చూసేందుకు పరిసర గ్రామాల ప్రజలు పెద్ద సంఖ్యలో అక్కడికి చేరుకున్నారు. అక్కడ స్వామివారికి ప్రత్యేక పూజలు అనంతరం ముత్తైదువులు గ్రామ పొలిమేర వరకు సాగనంపారు. ప్రత్యేక పూల అలంకరణతో పల్లకీలో దేవేరులతో కలిసి స్వామివారు శివారుల్లోని గొల్లబోయి ఆలయానికి చేరుకుని గొల్లబోయికి తొలిదర్శనం ఇచ్చారు. అనంతరం బోయలు పల్లకీ మోసుకుంటూ కాలినడకన కోనకు చేరుకున్నారు. ఉదయం 9 గంటలకు గోనుపల్లిలో బయలుదేరిన స్వామివారు మధ్యాహ్నం 12 గంటలకు కోనకు చేరకున్నారు. కార్యక్రమం లో ఆలయ అసిస్టెంట్ కమిషనర్ సాగర్ బాబు, ప్రధాన అర్చకులు రామయ్యస్వామి, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు. బ్రహ్మోత్సవాలు జరిగే ఐదురోజులు కూడా గోనుపల్లి వాసులు నియమ, నిష్ఠలతో మాంసాహారాలకు దూరంగా ఉంటారు. కాగా కోనకు చేరుకున్న స్వామి, అమ్మవార్లకు స్నపన తిరుమంజనం, విశేష పూజలు నిర్వహించారు.



కోనలో అంకురార్పణ పూజలు చేస్తున్న అర్చకులు

వైభవంగా అంకురార్పణ

కోనలోని శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాలు ఆదివారం రాత్రి అంకురార్పణతో మొదలయ్యాయి. ఆలయంలోని అలంకార పండపంలో అర్చకులు, వేదపండితులు ప్రత్యేక యాగశాల ఏర్పాటుచేసి నిత్య హోమాలను ప్రారంభించారు. అర్చకులు పుట్ట మన్నును తీసుకువచ్చి, అందులో నవధాన్యాలు కలిపి కలశస్థాపన చేసి అంకురార్పణకు శ్రీకారం చుట్టారు. ఎలాంటి ఆటంకాలు జరగకుండా విజయవంతంగా ఉత్సవాలు జరిగేందుకు ఈ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం కోన వీధుల్లో సేనాధిపతి ఉత్సవం నిర్వహించారు. తదుపరి శేషవాహనసేవ నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

● కుమారుడికి తీవ్ర గాయాలు



మహబూబ్‌జాన్ మృతదేహం
ఇన్‌సెట్‌లో ఫైల్ ఫొటో

రామాపురం, మే19: స్కూటర్‌ను కారు ఢీకొనడంతో షేక్. మహబూబ్ జాన్ (47) మృతి చెందగా, ఆమె కుమారుడు ఎస్. మహమ్మద్ అలీ తీవ్రంగా గాయపడ్డాడు. ఎస్ఐ ప్రసాద్ రెడ్డి కథనం మేరకు రామాపురం మండలం గువ్వలచెరువు వాసులు షేక్. మహబూబ్‌జాన్, ఆమె కుమారుడు షేక్. మహమ్మద్ అలీ పెళ్లి పత్రికలు పంచేందుకు రాయచోటికి వెళ్తుండగా ఆదర్శ పాఠశాల వద్ద సెల్ పాయింట్ భాస్కర్ కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆమె అక్కడికక్కడే మృతి చెందగా, మహమ్మద్‌అలీకి తీవ్రగాయాలయ్యాయి. ప్రమాదం జరిగిన వెంటనే కారు వెళ్లిపోతుండగా, పోలీసులు వెంబడించి డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. మృతదేహాన్ని రాయచోటి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతురాలికి భర్త, ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

గోపవరం, మే 19: రాచాయిపేట సచివాలయం సమీపంలో 40 ఏళ్ల గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. ఆదివారం చోటు చేసుకున్న సంఘటనపై వివరాల్లోకెళితే.... రాచాయిపేట సచివాలయం సమీపంలో గుర్తుతెలియని వ్యక్తి మృతి చెంది ఉండడాన్ని గమనించిన స్థానికులు బద్వేలు రూరల్ పోలీసులకు సమా చారం అందించారు. కాగా మృతుడు బ్లూ కలర్ టీ షర్టు, జీన్స్ ప్యాంటు ధరించి ఉన్నాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని పోస్టుమా ర్టం నిమిత్తం బద్వేలు ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

హార్సిలీ హిల్స్ ఘాట్‌లో తప్పిన ప్రమాదం



హార్సిలీహిల్స్‌లో బ్రేక్ ఫెయిల్ అయిన బస్సు

బి.కొత్తకోట,మే19: ప్రముఖ పర్యాటక కేంద్రం హార్స్‌లీహిల్స్ ఘాట్‌రోడ్డులో ఆదివారం పెనుప్రమాదం తప్పింది. అన్నమయ్య జిల్లా చిన్నమండ్యం నుంచి 40 మంది పర్యాటకుల బృందం విహారయాత్రలో భాగంగా హార్సిలీహిల్స్‌కు ఓ బస్సులో వచ్చారు. పర్యాటక ప్రదేశాలు అన్నీ కలియ తిరిగి, సాయంత్రం తిరుగు ప్రయాణమయ్యారు. బస్సు ఘాట్‌రోడ్డు మూడో మలుపు వద్దకు రాగానే బ్రేక్ ఫెయిల్ అయ్యి, అదుపుతప్పింది. దీంతో బస్సు డ్రైవర్ చాకచక్యంగా వ్యవహరించి బస్సును లోయలోనికి పోనివ్వకుండా ఓ బండరాయికి ఢీకొట్టాడు. ప్రయాణికులంతా ఏమి జరుగుతోందో తెలియక హాహాకారాలు పెట్టారు. ప్రమాదం నుంచి బయటపడ్డామని తెలుసుకుని ఉపశమనం పొందారు. ప్రమాదం జరగక పోవడంతో ప్రయాణికులు అధికారులు ఊపిరి పీల్చుకున్నారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరి మృతి





మునిగణేష్, పెంచలయ్య మృతదేహాలు

రైల్వేకోడూరు(రూరల్) మే 19: కుక్కలదొడ్డి వద్ద ఆదివారం తెల్లవారుజామున జరిగిన రెండు వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు మృతి చెందారు. చంద్రగిరి మండలం కొత్తపేట వాసి మునిగణేష్(24) బైకుపై కోడూరు జాతరకు వచ్చాడు. తిరిగి స్వగ్రామానికి వెళుతూ గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మరో సంఘటనలో మైసూరివారిపల్లి హరిజనవాడకు చెందిన చలమాల పెంచలయ్య(40) ఎస్.ఉప్పరపల్లెలోని తన చెల్లెలు ఇంటికి వెళ్లి తిరిగి స్వగ్రామానికి వెళుతుండగా ప్రధాన రహదారి వద్ద తిరుపతి వైపు వెళ్తున్న కారు ఢీకొనడంతో ఆయన అక్కడి అక్కడే మృతి చెందాడు. మృతదేహాలను కోడూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ విజయ్ కుమార్ తెలిపారు.

ఇప్పట్లో మోక్షం రాదా?

సగిలేరుపై హైలెవల్ బ్రిడ్జి అందని ద్రాక్ష ● తరచూ ఇబ్బందులు పడుతున్న ప్రజలు



వంతెనకు నోచుకోని సగిలేరు నది

కాశినాయన మే 19: ఉప్పలూరు ప్రజలకు సగిలేరు నదిపై హైలెవల్ బ్రిడ్జి ఏర్పాటు అందని ద్రాక్షలా మారింది. సగిలేటికి వరదలు వచ్చిన ప్రతిసారి పాత, కొత్త ఉప్పలూరు వాసులు బిక్కుబిక్కుమంటూ కాలం వెళ్లదీస్తుంటారు. దాదాపు 200 కుటుంబాలున్న ఈరెండు గ్రామాలు సగిలేరు నదికి అత్యంత సమీపంలో ఉన్నాయి. సగిలేరుకు ఇరువైపులా వందల ఎకరాల వ్యవసాయ భూములు ఉండడంతో ప్రజలు నది దాటి అటూ ఇటూ రాకపోకలు సాగించాల్సి ఉంటుంది. సగిలేరుకు ఎగువ ప్రాంతం నుంచి సీజన్‌లో వచ్చే వరదల మూలంగా వారాల తరబడి నదిలో రాకపోకలు నిలిచి వ్యవసాయానికి తీవ్ర ఆటంకం ఏర్పడుతోందని గ్రామస్థులు వాపోతున్నారు. పంటలు చేతికి వచ్చేసమయంలో సగిలేరుకు వరదలు వస్తే ఆరైతుల పరిస్థితి వర్ణనాతీతంగా ఉంటుంది. కనీసం పొలం వద్దకు వెళ్లి వస్తామన్నా రైతులు నదిదాటుకోలేని పరిస్థితి. గ్రామానికి పడమరవైపు ఉప్పాగు, తూర్పు, ఉత్తరం వైపుల సగిలేరు నది గ్రామాలను చుట్టేసినట్లు ఉంటుంది. సగిలేరు కు వరదలు వచ్చిన ప్రతిసారీ మండల కేంద్రమైన నర్సాపు రం సహా చుట్టుపక్కల గ్రామాలతో సంబంధాలు తెగిపోతా యి. 1996, 1998లల్లో ఎగువనున్న నంద్యాల, నల్లమల అడవి, గిద్దలూరు పరిసర ప్రాంతాల్లో కురిసిన భారీవర్షాల మూలంగా పైభాగంలో ఉన్న అనేక చెరువులు, కుంటలు తెగి సగిలేటికి భారీగా వరదలు వచ్చాయి. దీంతో ఆ రెండు గ్రామాల ప్రజలకు రోజుల తరబడి కంటిమీద కునుకులేకుండా చేశాయి. ప్రజలు ఇళ్ళను ఖాళీచేసి పశువులు సహా సమీప మిట్టప్రాంతానికి వెళ్లారంటే పరిస్థితి ఏస్థాయిలో ఉండి ఉంటుందో ఇట్టే అర్థమవుతోంది. నాటి నుంచి సగిలేరుపై హైలెవల్ బ్రిడ్జి ఏర్పాటు చేయాలనే డిమాండ్ గ్రామస్థుల నుంచి బలంగా వినిపిస్తోంది. సమస్య తీవ్రతను గుర్తించిన గ్రామస్తులు వంతెన ఏర్పాటు చేయాలని అధికారులు, ప్రజాప్రతినిధులకు పలుమార్లు తెలిజేశామంటున్నారు. దశాబ్దాలు గడిచిపోతున్నా అదినేటికీ కార్యరూపం దాల్చకపోవడంపై ప్రజలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల ఈరెండు గ్రామాలను కలుపుతూ సగిలేరు మీదుగా తెల్లబాడు క్రాస్ రోడ్డునుంచి పిట్టిగుంట బస్టాప్ వరకు దాదాపు 8కి.మీ మేర కొత్తగా తారురోడ్డు నిర్మించారు. సగిలేరులో బ్రిడ్జి నిర్మించకుండా తారు రోడ్డు వేసినా పెద్దగా పైగ్రామాలవారికి ప్రయోజనం ఉండదంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సగిలేరుపై వంతెన నిర్మాణ జరిగేలా అధికారులు తగుచర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

జనజీవనం స్తంభిస్తోంది



సగిలేరుకు వరదలు వచ్చిన ప్రతిసారి జనజీవనం స్తంభిం చిపోతోంది. అన్ని వర్గాల ప్రజలకు కష్టాలు తప్పడం లేదు. వరద ఉధృతి తగ్గినా పెద్ద పెద్ద గుండాలు ఏర్పడడంతో నది దాటుకోవడం కూడా కష్టంగా ఉంటుంది. రెండేళ్లగా అదోబ్రిడ్జి ఇదో బ్రిడ్జి అంటున్నారేగానీ ఇంతవరకు కార్యరూపం దాల్చలేదు

ముత్తుముల పీరారెడ్డి, పాత ఉప్పలూరు

త్వరలో పనులు ప్రారంభిస్తాం

సగిలేరునదిపై రూ.10.21 కోట్లతో హైలెవల్ బ్రిడ్జి మంజూరైంది. ఇప్పటికే ఉన్నతాధికారులతో కలిసి పలుమార్లు క్షేత్ర స్థాయి పరిశీలన పూర్తిచేశాం. పేపర్ వర్క్ నడుస్తోంది. పనులు త్వరలో మొదలు పెట్టిస్తాం.

అమర్‌నాథ్, పీఆర్ డీఈ

అలరించిన నృత్య ప్రదర్శనలు

పులివెందుల టౌన్, మే 19: పట్టణంలోని శిల్పారామం మరియు ఉలిమెల్ల లేక్ ఫ్రంట్‌లో వారాంతపు సాంస్కృతిక కార్యక్రమాలలో భాగంగా నిర్వహించిన నృత్య ప్రదర్శనలు సందర్శకులను అలరించాయి. పరిపాలన అధికారి సుధాకర్ పర్యవేక్షణలో ఈ కార్యక్రమాలు సాగాయి. శిల్పారామంలో విజయవాడ ఎక్సలెంట్ ఇన్‌స్టిట్యూట్ వారి నాగార్జున (ఈఎం) స్కూల్, పులివెందుల చిన్నారులచే డ్యాన్స్ మాస్టర్ చిట్టి ఆధ్వర్యంలో నృత్యాలు చేశారు. గణనాయకాయ గణదైవతాయ గణదైవతాయ గనదక్షాయ ధీమహి, వేయి నామాలవాడ, పూలమ్మే పిల్లా, కుర్చీని మడత తదితర పాటలకు నృత్యం చేశారు. అలాగే ఉలిమెల్ల లేక్ ఫ్రంట్‌లో చిత్తూరు జిల్లా బైరెడ్డిపల్లె కళాతరంగిణి సంస్థ బృందం నృత్య ప్రదర్శనలు ఇచ్చారు. మహాగణపతి మనసాస్మరమి, రాములమ్మ, తకిట తధిమి తందానా, కళ్లజోడు కాలేజీ పాప జూడు తదితర పాటలకు నృత్యం చేశారు. కార్యక్రమాలను విజయవంతం చేసిన సందర్శకులకు ఏఓ సుధాకర్ కృతజ్ఞతలు తెలిపారు.



శిల్పారామంలో నృత్యం చేస్తున్న విద్యార్థిని


ఉలిమెల్ల లేక్ ఫ్రంట్‌లో నృత్యం చేస్తున్న కళాతరంగిణి బృందం

రేపటి నుంచి మోక్షనారాయణస్వామి బ్రహ్మోత్సవాలు

రేపటి నుంచి మోక్ష నారాయణస్వామి బ్రహ్మోత్సవాలు

కమలాపురం రూరల్, మే 19: కమలాపురం మండలం రామాపురం క్షేత్రంలో ఈనెల 21 నుంచి మోక్షనారాయణ స్వామి బ్రహ్మోత్సవాలు జరగనున్నట్లు ఆలయ వ్యవస్థాపకుడు సాయినాథశర్మ తెలిపారు. 21న మంగళవారం గణపతిపూజతో ప్రారంభమై అంకురార్పణ, గోపూజ గో సంరక్షణ, యాగశాల ప్రవేశం, అర్చనలు, విష్ణు, లక్ష్మి, సుబ్రమణ్యం, ఆంజనేయ, సంయుక్త పారాయణములు, ధ్వజారోహణం, తీర్థప్రసాద వినియోగం తదితరాలు ఉంటాయి. 25వ తేదీ వరకు ఈ ఆలయంలో పలు పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ప్రతిరోజూ ఉత్సవమూర్తులకు వాహన సేవలు, సాయంత్రం 6 గంటల నుంచి ప్రారంభమమవుతాయి. 25న శనివారం రాత్రి 8 నుంచి ఫ్రెండ్స్ ఆర్కెస్ట్రా, డ్యాన్స్ బేబీ డ్యాన్స్ సంగీత కళాకారులచే సినీ పాటలు, నృత్యవిన్యాసాలు, అద్భుత నృత్య ప్రదర్శన ఉంటుంది. వేద పండితులు గుంటూరు పట్టణానికి చెందిన సలక్షణ ఘనాపాటి వంశీక్రిష్ణ శర్మ ఆధ్వర్యంలో జరుగుతుంది. కావున భక్తులందరూ ఆలయానికి చేరుకుని మోక్ష నారాయణ స్వామిని దర్శించుకుని స్వామివారి కృపకు పాత్రులు కావాలని నిర్వాహకులు కోరుతున్నారు.

'నిబంధనలు తప్పక పాటించాలి


ఎస్ఐ ధనుంజయుడు

వేముల, మే 19: 144 సెక్షన్, 30 పోలీస్ యాక్ట్ చట్ట వ్యతిరేక చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ ధనుంజయుడు హెచ్చరించారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ జూన్ 6వ తేదీ వరకు వేముల మండల పరిధిలో ఎలాంటి ఊరేగింపులు, ర్యాలీలకు అనుమతి లేదన్నారు. నలుగురికి మించి గుమిగూడవద్దన్నారు. ట్రబుల్ మాంగర్లు, బైండోవర్ కేసుల్లో ఉన్న వారు జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించారు.

నిబంధనలు అతిక్రమిస్తే తాటతీస్తాం: సీఐ

పెండ్లిమర్రి, మే 19: ఎన్నికల కౌంటింగ్ (2024) సందర్భంగా ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగటానికి వీలులేదని, ఇరు పార్టీల వారు విద్వేషపూరిత ప్రసంగాలు, రెచ్చగొట్టే ప్రయత్నాలు చేయటానికి ప్రయత్నిస్తే తాట తీయటానికి కూడా వెనుకాడబోమని సీఐ నాగరాజు, ఎస్ఐ హరిప్రసాద్ హెచ్చరించారు. అలాగే కౌంటింగ్ అయిపోయిన తర్వాత కనీసం మూడు రోజుల వరకు పెట్రోల్‌ను వాటర్ బాటిళ్లలో కానీ, క్యాన్లలో కానీ పోయటానికి వీలులేదని హెచ్చరించారు. టపాసులు అమ్మే వారు కూడా కౌంటింగ్ సందర్భంగా అమ్మేందుకు వీలు లేదన్నారు. కౌంటింగ్ సమయంలో గుంపులు ఉండకూడదని, బైండోవర్ కేసులో ఉన్న వారు ఇల్ల నుంచి బయటకు రాకుండా ఉంటే మంచిదని, పొరపాటున బయటకు వచ్చి చిన్న ఘర్షణ జరిగినా బాధపడాల్సి వస్తుందన్నారు. గ్రామ బహిష్కరణ చేయడానికి కూడా వెనుకాడబోమని హెచ్చరించారు.

ఘనంగా సుదర్శన చక్ర హోమం

కడప (కల్చరల్), మే 19: కాలజ్ఞాన కర్త శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి వారి 331 ఆరాధన గురుపూజ మహోత్సవాలను పురస్కరించుకుని నగర మున్సిపల్ మైదానంలోని అయ్యప్ప స్వామి ఆలయం పక్కన వెలసిన గోవిందమాంబ సమేత శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి వారి ఆలయంలో ఆదివారం శ్రీ సుదర్శనచక్ర హోమం ఘనంగా జరిగింది. ఆలయ కమిటీ అధ్యక్షుడు మర్రిపల్లె ధనుంజయ ఆచారి సారథ్యంలో ఉదయం 5 గంటలకు స్వామివారికి సుప్రభాతసేవ, తదుపరి గణపతి పూజ, పంచామృతం, 8 గంటలకు విశ్వ గాయత్రీమాత పూజ, అనంతరం పంచ బ్రహ్మల పంచకలశ స్థాపన పూజ, నవగ్రహ శాంతిపూజ, 9 గంటలకు వాస్తు శాంతిపూజ, 10 గంటలకు మన్యు పాసుపత శ్రీ సుదర్శన చక్ర హోమం, కార్యక్రమాలను అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. పిదప మధ్యాహ్నం 1 గంటకు స్వామివారి భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు భక్తులు పాల్గొని స్వామివారి సేవలో తరించారు.



సుదర్శన హోమం నిర్వహిస్తున్న దృశ్యం

ఎన్నికల అలవెన్సు తక్షణమే చెల్లించాలి: ఏఐటీయూసీ


సమావేశంలో మాట్లాడుతున్న వేణుగోపాల్

కడప (మారుతీనగర్), మే 19: రాష్ట్ర వ్యాప్తంగా ఈనెల 13న జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో అన్ని పోలింగ్ కేంద్రాలలో విధులు నిర్వహించిన ఆశా కార్యకర్తలకు ఎన్నికల అలవెన్స్ తక్షణమే చెల్లించాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు గుంటి వేణుగోపాల్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక ఏఐటీయూసీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ఎన్నికల కమిషన్ గత 2023వ తేదీన అలవెన్స్ టీఏ-డీఏ ఇచ్చినట్లు ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. ఆమేరకు రాష్ట్ర ఎన్నికల కమిషన్ కూడా 2024 ఏప్రిల్ 27న మెమో జారీచేసి ఎన్నికల పోలింగ్ కేంద్రాల వద్ద విధులు నిర్వహించిన ప్రతి ఆశా కార్యకర్తకు 500 రూపాయలు ఇవ్వాలని ఉత్తర్వులు జారీచేసిందన్నారు. అయినప్పటికీ ఇంతవరకు రాష్ట్రంలోని పలు జిల్లాలలో ఎన్నికల విధులు నిర్వహించిన ఆశా కార్యకర్తలకు అలవెన్స్‌లు చెల్లించలేదన్నారు. పైపెచ్చు ఆశా కార్యకర్తలకు అలవెన్స్‌ల నిధులను విడుదల చేయలేదని బుకాయిస్తూ వారి ఉసురు పోసుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇదివరకే 10వ తరగతి, ఇంటర్‌మీడియట్ పరీక్షా కేంద్రాలలో విధులు నిర్వహించినప్పటికీ అలవెన్స్‌లు ఇవ్వకుండా తొక్కిపెట్టారన్నారు. కరోనా కాలంలో కేంద్రం నెలకు రూ.1000 ప్రకారం అదనపు వేతనం 6 నెలలకు గాను 6 వేల రూపాయలు విడుదల చేసినప్పటికీ ఆ డబ్బును ఇంతవరకు ఇవ్వలేదన్నారు. ఇప్పటికైనా పాలక ప్రభుత్వాలు త్వరితగతిన స్పందించి పెండింగ్‌లో ఉన్న అలవెన్సులు చెల్లించాలని, లేకుంటే ఉద్యమాన్ని చేపడతామని హెచ్చరించారు. ఆశా వర్కర్స్ యూనియన్ ఏపీ అధ్యక్షురాలు పి. సుభాషిణి, జిల్లా కోశాధికారి అమ్ములు, ఏఐటీయూసీ నాయకులు చంద్రశేఖర్ పాల్గొన్నారు.

గంగమ్మతల్లికి ఘనంగా పూజలు


పూజలు అందుకుంటున్న గంగమ్మ తల్లి

సీకేదిన్నె, మే 19: చింతకొమ్మదిన్నె మండలం కొత్తపేట గంగమ్మతల్లికి భక్తులు ఘనంగా పూజలు చేశారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు ఆదివారం అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి బోనాలు సమర్పించి వారి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయం చుట్టూ ప్రదక్షణలు చేసి వారి కోర్కెలు అమ్మవారికి విన్నవించుకున్నారు. వర్షాలు సక్రమంగా కురిసి పంటలు సంవృద్ధిగా పండాలని రైతులు అమ్మవారికి మొక్కులు మొక్కుకున్నారు. తమ కోర్కెలు నెరవేరిన భక్తులు అమ్మవారి సన్నిధికి వచ్చి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై అమ్మవారికి మొక్కులు తీర్చుకుని బంధుమిత్రులతో కలిసి విందు భోజనాలు ఏర్పాటు చేసుకున్నారు.

ఇంటర్‌మీడియట్‌లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

వేంపల్లె, మే 19: ఇంటర్‌మీడియట్‌లో ఉర్దూ, ఇంగ్లీష్ మీడియంలో విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని ఉర్దూ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ రవి ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ ఏడాది వేంపల్లె ఉర్దూ జూనియర్ కళాశాలలో అడ్మిషన్లు పొందాలని, విద్యార్థులు ఉర్దూ మరియు ఇంగ్లీష్ మీడియంతో పాటు సెకండ్ లాంగ్వేజ్ ఉర్దూ మరియు తెలుగు తీసుకోవచ్చని ఆ ప్రకటనలో ఆయన తెలిపారు.

'బురదజల్లడం తగదు'


ఏపీ మైనింగ్ డైరెక్టర్ సల్మా

వేంపల్లె, మే 19: వేంపల్లెలో జరుగుతున్న మట్టి తరలింపు, ఇసుక, కంకర తదితరకు తనకు సంబంధం లేదని, నిరాధారమైన ఆరోపణలు చేయడం తగదని ఏపీ మైనింగ్ డైరెక్టర్ సల్మా ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సంబంధం ఉందంటూ పదేపదే ప్రచారం చేయడం దురదృష్టకరమన్నారు. పార్టీలో కష్టపడి పనిచేసినందుకు గుర్తింపుగా మైనింగ్ డైరెక్టర్ పదవి వచ్చిందని, అయితే కొందరు అసూయతో దుష్ప్రచారం చేయడం శోచనీయమని పేర్కొన్నారు. ఇలాంటి ప్రచారం పదేపదే చేస్తే చట్టపరంగా చర్యలు తీసుకోవాల్సి వస్తుందని ఆమె ఆ ప్రకటనలో తెలిపారు.

హిందూ శ్మశానవాటిక అభివృద్ధి


చెన్నూరు హిందూ శ్మశాన వాటికలో మానవతా సంస్థ ఆధ్వర్యంలో పనులు చేస్తున్న దృశ్యం

చెన్నూరు, మే 19 : చెన్నూరు పెన్నాతీరంలోని హిందూ శ్మశాన వాటికను మానవతా సేవా సంస్థ ఆధ్వర్యంలో అభివృద్ధి చేశారు. గతంలో కంపచెట్లు, రాళ్ల కుప్పలతో శ్మశానవాటిక దహన క్రియలకు, ఖననానికి ఇబ్బందికరంగా ఉండేది. అయితే ప్రజలు ఈ సమస్యను మానవతా సేవా సంస్థ దృష్టికి తీసుకుపోవడంతో దాన్ని సేవా సంస్థ అధ్యక్షుడు జీఎన్ భాస్కర్‌రెడ్డి, ఆటోబాబు ఆధ్వర్యంలో ఆదివారం కంపచెట్లు, రాళ్లకుప్పలను తొలగించి చదను చేయించారు. అలాగే శ్మశానం చుట్టూ కానుక మొక్కలు నాటారు. అంతేకాక ఆ ప్రాంతంలో చెన్నూరు పంచాయతీలోని మురుగునీరంతా వస్తుండటంతో ఆ నీరు ఓ వైపునకు వెళ్లేటట్లు ఏర్పాటు చేశారు. అంతేకాక ముత్తయిదుతనానికి అవసరమైన వాటిని భర్త చనిపోయిన తరువాత తీసివేసేందుకు వారు స్నానాలు చేసేందుకు వీలుగా వంతెన కిందనే గతంలో ఆ ప్రాంతంలో ఏర్పాటు చేసిన గది బాగు చేశారు. అందులో నీటి కుళాయిల ఏర్పాటు, బండ చప్పట ఏర్పాట్లు చేశారు.

ప్రతిభగల విద్యార్థులను ప్రోత్సహించడం అభినందనీయం: ఎంఈఓ


మెమొంటోలతో విద్యార్థులు, ట్రస్ట్ చైర్మన్ శ్రీధర్‌రెడ్డి

సింహాద్రిపురం, మే 19: వైజీఆర్ ట్రస్ట్ (నంద్యాలంపల్లి) చైర్మన్ వై.శ్రీధర్‌రెడ్డి విద్యార్థులను ప్రోత్సహించడం అభినందనీయమని సింహాద్రిపురం ఎంఈఓ శారద పేర్కొన్నారు. ఆదివారం సింహాద్రిపురం జడ్పీ ఉన్నత పాఠశాలలో వైజీఆర్ ట్రస్ట్ నంద్యాలంపల్లి వారి ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. మండంలోని ఏడు జడ్పీ ఉన్నత పాఠశాలలు, ఒక కస్తూర్బా పాఠశాలలో ఇటీవల పదో తరగతి పరీక్షల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలను కైవసం చేసుకున్న 24 మంది విద్యార్థులకు రూ.72 వేలు నగదు ప్రోత్సాహక బహుమతులు, మెమొంటోలను ట్రస్ట్ చైర్మన్ శ్రీధర్‌రెడ్డి, ఆయన కుటుంబ సభ్యులు అందజేశారు. ఈ సందర్భంగా వక్తలు వైజీఆర్ ట్రస్ట్ సేవలను కొనియాడారు. అనంతరం రిటైర్డ్ ఉపాధ్యాయులను, ప్రధానోపాధ్యాయులను, ఉపాధ్యాయులను ట్రస్ట్ సభ్యులు సన్మానించారు.

22 నుంచి బ్రహ్మోత్సవాలు

మైదుకూరు, మే 19 : పట్టణ శివారులోని కొత్తపాళెంలో ఉన్న వీరాంజనేయ స్వామి ఆలయంలో ఈనెల 22 నుంచి 3 రోజుల పాటు స్వామివారి బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నారు. 22న ఉదయం స్వామివారికి గణపతి హోమం అభిషేకాలు కుంకుమార్చనలుచ అష్టోత్తర నామ పూజలు, 23న ప్రత్యేక పూజా కార్యక్రమాలతో భారీ అన్నదానం, రాత్రికి జెండా ఊరేగింపు, చెక్కభజనలు నిర్వహించనున్నారు. అలాగే 24న రాష్ట్ర స్థాయి సీనియర్ విభాగంలో బండలాగు పోటీలు నిర్వహించి, గెలుపొందిన ఎద్దుల యజమానులకు నగదు బహుమతులు అందివ్వనున్నట్లు ఆలయ ధర్మకర్త సుబ్బరాయుడు తెలిపారు.

జూనియర్ ఎన్టీఆర్ అభిమానులకు చెక్కుల పంపిణీ

కడప (కల్చరల్), మే 19: అభిమానుల శ్రేయస్సును కాంక్షించే రియల్ హీరో జూనియర్ ఎన్‌టీఆర్ అని జూనియర్ ఎన్‌టీఆర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు యర్రమల సుధాకర్‌రెడ్డి కొనియాడారు. గత ఏడాది జూనియర్ ఎన్‌టీఆర్ జన్మదినం సందర్భంగా కడపలో సింహాద్రి సినిమాను రీ రిలీజ్ చేసిన సంగతి తెలిసిందేనన్నారు. ఆ సినిమాకు వచ్చిన కలెక్షన్స్ డబ్బును ఆర్థిక ఇబ్బందులు పడుతున్న జిల్లాకు చెందిన 15 మంది ఆయన అభిమానులకు ఆదివారం స్థానిక అప్సర థియేటర్ వద్ద పంపిణీ చేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు కందుల నాగేశ్వర్‌రెడ్డి, సూర్య, అభిమానులు అల్లాబకష్, దశరథ, హరి, సాయిగౌస్, సునీల్, రాంకీ, శివ, ఖాజీపేట సునీల్‌తో పాటుగా పలువురు పాల్గొన్నారు.


చెక్కులు పంపిణీ చేస్తున్న సుధాకర్‌రెడ్డి

ఎయిడ్స్‌పై అవగాహన కలిగి ఉండాలి



కొవ్వొత్తులతో సంఘీభావం తెలుపుతున్న ఐసీటీసీ కౌన్సిలర్ సుబ్బయ్య, ఆసుపత్రి సిబ్బంది

పులివెందుల రూరల్, మే 19: ఎయిడ్స్‌వ్యాధి పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఐసీటీసీ కౌన్సిలర్ వెంకటసుబ్బయ్య అన్నారు. ఆదివారం స్థానిక ఏరియా ఆసుపత్రి వద్ద హెచ్‌ఐవీ, ఎయిడ్స్‌తో మరణించిన వారి ఆత్మకు శాంతి కలగాలని, ఇప్పటి వరకు పోరాడుతున్న వారికి సంఘీభావంగా కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ ఎయిడ్స్ వ్యాధి అంటించుకునే వ్యాధి అన్నారు. అలాగే రోగుల పట్ల వివక్ష చూపకూడదన్నారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సిబ్బంది, స్నేహిత అమృత హస్తం సేవా సమితి అధ్యక్షుడు రాజు తదితరులు పాల్గొన్నారు.

నీతికి, నిర్భీతికి నిలువుటద్దం నీలం సంజీవరెడ్డి

- నిరాడంబరుడు సుందరయ్య: తులసిరెడ్డి

వేంపల్లె, మే 19: నీతి, నిజాయితీ, నిర్భీతికి నిలువుటద్దం స్వర్గీయ నీలం సంజీవరెడ్డి అని కాంగ్రెస్ రాష్ట్ర మీడియ చైర్మన్ తులసిరెడ్డి కొనియాడారు. వేంపల్లెలో నీలం సంజీవరెడ్డి 111వ జయంతిని ఆదివారం కాంగ్రెస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తులసిరెడ్డి మాట్లాడుతూ స్వాతంత్ర్య సమరయోధుడిగా క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొని నాలుగేళ్లు జైలు జీవితం గడిపారన్నారు. రెండుసార్లు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా, కేంద్ర మంత్రిగా, లోక్‌సభ స్పీకర్‌గా, రాష్ట్రపతిగా ఉన్నత పదవులు ఆయనను వెతుక్కుంటూ వచ్చాయన్నారు. అలాగే పార్లమెంటులో ప్రతిపక్ష నాయకుడిగా ఉంటూ సైకిల్‌పై పార్లమెంటుకు పోయిన నిరాడంబరుడు స్వర్గీయ పుచ్చలపల్లె సుందరయ్య అని తులసిరెడ్డి అన్నారు. సుందరయ్య వర్ధంతిని వేంపల్లెలో కాంగ్రెస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. కాంగ్రెస్ నాయకులు సుబ్రమణ్యం, బాబు, రామకృష్ణ, సుబ్బరాయుడు, బాలం సుబ్బరాయుడు, వేమయ్య, శివ, అమర్, ఉత్తన్న, వినయ్, రాజు, రాజ, చంద్రశేఖరొరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


నీలం సంజీవరెడ్డికి నివాళులు అర్పిస్తున్న తులసిరెడ్డి

ఆకట్టుకున్న నృత్యాలు



కడప (కల్చరల్), మే 19: కడప నగరం రిమ్స్ సమీపంలోని శిల్పారామంలో గల సాంస్కృతిక కళావేదికపై కడప నగరానికి చెందిన ఆర్.కె. డాన్స్ అకాడమీ బృందం ఆదివారం వివిధ పల్లె జానపద, శాస్త్రీయ, సినీ గీతాలకు చేసిన నృత్యాలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. ఆదివారం ఆటవిడుపులో భాగంగా శిల్పారామం సందర్శకులతో జనసంద్రంగా మారింది. పిల్లలు--పెద్దలు-- పెద్ద ఎత్తున శిల్పారామం సందర్శించి ఉల్లాసంగా సేదతీరారు.

ఊరేగింపులు, ర్యాలీలకు అనుమతిలేదు

మైదుకూరు, మే 19 : సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియ పూర్తి అయ్యేవరకు ఎలాంటి ఊరేగింపులు, ర్యాలీలకు అనుమతి లేదని, 144, 30 సెక్షన్లు అమలు ఉంటుందని డీఎస్పీ వెంకటేసులు తెలిపారు. స్థానిక కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ జూన్ 6వ తేదీ వరకు అమలులో ఉంటుందని, ఎలాంటి ఊరేగింపులు, ర్యాలీలు జరపకూడదన్నారు.

ఇళ్ల మధ్య మురుగునీటితో ప్రజల ఇక్కట్లు

- వెంటనే సమస్యను పరిష్కరించాలని వినతి

చెన్నూరు, మే 19: చెన్నూరు దళితవాడలో ఇళ్ల మధ్యలో మురుగునీరు నిల్వ చేరడంతో అక్కడి ప్రజలు ఇబ్బందిపడుతున్నారు. ఆయా ఖాళీ స్థలాల యజమానులు నిర్మాణాలు చేపట్టకపోవడంతో ఆ ప్రాంతం మురుగునీటిమయంగా మారింది. చాలా కాలంగా ఆ చుట్టుపక్కల మురుగు కాల్వల్లోని నీరంతా ఇళ్లమధ్య చేరడంతో దాదాపు మూడు అడుగులకు పైగా మురుగునీటి గుంత ఏర్పాటైంది. గాలి వీస్తే విపరీతమైన దుర్వాసన, చీకటి పడితే ఆ మురుగునీటి నుంచి దోమల సంచారంతో స్థానికులు ఇబ్బందిపడుతున్నారు. స్థానిక ప్రజలు ఈ మురుగునీటి నుంచి తమకు విముక్తి కల్పించాలని, మురుగునీరు లేకుండా ఈ స్థలాన్ని కొన్న వ్యక్తి అందులో మట్టి తొలగించి గుంత లేకుండా చేసి ప్రజలు అనారోగ్యం బారిన పడకుండా చూడలాని కోరుతున్నారు. అలాగే స్థానిక గ్రామ పంచాయతీ వైద్య ఆరోగ్యశాఖ ఇరువురూ సంయుక్తంగా ఈ ప్రాంతంలో ప్రజలు అనారోగ్యంబారిన పడకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.


చెన్నూరు దళితవాడలో ఇళ్ల మధ్య నిలిచి ఉన్న మురుగునీరు

వైభవంగా పెద్దమ్మ దేవర





విశేష అలంకరణలో పెద్దమ్మ తల్లి, ఆలయం వద్ద క్యూలైన్‌లో భక్తులు

ఎర్రగుంట్ల, మే 19: పోట్లదుర్తిలో పెద్దమ్మ-చిన్నమ్మ జాతర అత్యంత వైభవంగా జరిగింది. 5రోజులుగా అమ్మవారికి చల్ల, ప్రత్యేక పూజలు, చిన్నమ్మ, పెద్దమ్మ గ్రామోత్సవం, పొలిచల్లడం కార్యక్రమాలు నిర్వహించారు. ఆదివారం అమ్మవారికి బోనాలు సమర్పిం చారు. అమ్మవారి దర్శనానికి వేలాదిగావచ్చిన భక్తులు తమ మొక్కులను తీర్చుకున్నారు. ముఖ్యంగా ఇతర గ్రామాలనుంచి వచ్చిన బందుగణం పెద్దమ్మ-చిన్నమ్మలను దర్శించుకుని మొక్కుకున్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు పెద్దఎత్తున బందోబస్తు నిర్వనిర్వహించారు.

● **అమ్మవారిని దర్శించుకున్న సీఎంరమేష్ కుటుంబం:** మాజీ రాజ్యసభ సభ్యుడు సీఎం రమేష్ కుటుంబం అమ్మవారిని దర్శించకున్నారు.

కొండాపురం..: మండలంలోని కె.సుగుమంచిపల్లె గ్రామంలో ఆదివారం పెద్దమ్మ తల్లి దేవరను ఘనంగా నిర్వహించారు.చాలా ఏళ్ల తర్వాత పెద్దమ్మ తల్లి దేవరను గ్రామస్తుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వాహించారు. ఈ సందర్భంగా గ్రామదేవత పెద్దమ్మతల్లి కి ప్రత్యేక పూజలు నిర్వహించి బోనాలు సమర్పించారు.పెద్ద ఎత్తున జంతుబలులు సమర్పించి తమ మొక్కుబడులను తీర్చుకున్నారు.ఈ దేవరకు మండలంలోని గ్రామాల నుంచే కాకుండా ఇతర ప్రాంతాల నుంచి కూడా పెద్ద ఎత్తున భక్తులు వచ్చి తమ మొక్కుబడులను తీర్చుకున్నారు.



కె.సుగుమంచిపల్లెలో పెద్దమ్మ తల్లికి పూజలు నిర్వహిస్తున్న భక్తులు

భక్తిశ్రద్ధలతో అంకాలమ్మకు పూజలు



సుంకేసులపల్లెలో అంకాలమ్మ జాతరకు తరలివెళుతున్న గ్రామస్థులు

పోరుమామిళ్ల, మే 19 : భక్తిశ్రద్ధలతో అంకాలమ్మకు పూజలు చేశారు. ఆదివారం పోరుమామిళ్ల మండలంలోని సుంకేసులపల్లె గ్రామంలో అంకాలమ్మ జాతర జరిగింది. ఈ సందర్భంగా మహిళలు భక్తులు మొక్కుబడులతో ఊరేగింపుగా అంకాలమ్మ దేవాలయం వద్దకు వచ్చి పూజలు నిర్వహించి బోనాలు సమర్పించారు. అనంతరం మొక్కు బడులు చెల్లించి స్నేహితులు, బంధువులతో కలిసి విందు కార్యక్రమం నిర్వహించారు.

వైభవంగా గంగ జాతర



బోనాలు సమర్పించి పూజలు చేస్తున్న భక్తులు

జమ్మలమడుగు, మే 19: జమ్మలమడుగు మున్సిపాలిటీ పరిధిలోని కన్నెలూరు గ్రామంలో గంగమ్మ జాతర వైభవంగా జరిగింది. గ్రామ పెద్దలు కలిసి ఐకమత్యంతో ఎక్కడా సమస్యలు రాకుండా గంగజాతరను జరుపుకున్నారు ఈనెల 17 నుంచి 19వ తేదీ వరకు వివిధ కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో ముగిశాయి. ఆదివారం గంగ జాతర, ఆవుల పబ్బం నిర్వహించారు. ఉదయం నుంచి పాలేటియాగం అనంతరం అమ్మవారికి బోనాలు సమర్పించుట జరిగింది. సాయంత్రం మద్దిమానుయాగం అలాగే బీల్లేయుని కథ చెప్పారు. ఆవుల పందేరం, రాత్రి అమ్మవారి బండారం పంచుట తదితర కార్యక్రమం జరిగింది. అలాగే కన్నెలూరు గ్రామంలో జాతర వాతావరణం, జనరద్దీ ఆలయం వద్ద భక్తుల కిటకిట, అమ్మవారికి మొక్కుబడులు చెల్లించారు. ఈ సందర్భంగా డీఎస్పీ యశ్వంత్ ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.

భారీ వర్షంతో రోడ్లు జలమయం



కన్నెలూరులో రోడ్డుపై నిలిచిన వర్షపునీరు

జమ్మలమడుగు, మే 19: జమ్మలమడుగులో ఇటీవల రెండు రోజులుగా అప్పుడప్పుడు కురిసిన భారీ వర్షానికి రోడ్లు జలమయం అయ్యాయి. అందులో భాగంగా కన్నెలూరు గ్రామంలో ప్రధాన రోడ్డుపై వర్షపునీరు అధికంగా నిలిచాయి. అలాగే ఎత్తపువారి కాలనీలో పలుచోట్ల రోడ్లపై వర్షపునీరు నిలిచి రాకపోకలకు అసౌకర్యంగా మారింది. ఇక డ్రైనేజీ కాలువల్లో నీరు నిండి రోడ్డుపై చేరాయి. అలాగే పట్టణంలోని పలు చోట్ల వర్షపునీరు నిలిచింది. శనివారం రాత్రి కురిసిన వర్షానికి రోడ్లు జలమయం అయ్యాయి. ప్రస్తుతం వాతావరణం ఒక్కసారిగా కొంతవరకు చల్లబడింది.


ప్రారంభమైన చెన్నకేశవ సంజీవరాయస్వామి బ్రహ్మోత్సవాలు



ధ్వజారోహణ పటం ఎగరవేస్తున్న దృశ్యం

రాజుపాలెం, మే 19 : వెల్లాల చెన్నకేశవ సంజీవరాయస్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభ సూచికంగా గరుడ ధ్వజ పటం ఎగురవేసి ధ్వజారోహణ కార్యక్రమం ఆదివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఉదయం ఉత్సవంగస్నపనం, అంకురార్పణ కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయంలో ముందుగా శ్రీదేవి భూదేవి సమేత చెన్నకేశవస్వామి సంజీవరాయస్వామి కొత్త వస్త్రాలపై చిత్రీకరించిన గరుడ పటం ఉత్సవమూర్తుల ఎదుట కలశాలు ఉంచి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ధ్వజస్తంభం చుట్టూ దర్భలు ఉంచి బ్రహ్మోత్సవాల గరుడ పటాన్ని ఎగురవేశారు. ధ్వజస్తంభంపై ఎగిరే గరుడ పతాకమే అష్టదిక్పాలకులు, సకల దేవతలకు బ్రహ్మోత్సవాలు ఆహ్వానం పలికినట్లు అయింది. పుట్టబంగారం తీసుకువచ్చి కలశాలలో నవ ధాన్యాలు మొలకెత్తడం పూజా కార్యక్రమాలు చేశారు. ఈ కార్యక్రమంలో దేవస్థాన చైర్మన్ జగదీశ్వర్‌రెడ్డి, కార్యనిర్వాహక అధికారి బీవీ నరసయ్య, అర్చకులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నతశిఖరాలకు చేరుకోవాలి



ప్రతిభా పురస్కారాలు అందజేస్తున్న దృశ్యం

ప్రొద్దుటూరు టౌన్, మే 19: విద్యార్థులు ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని రిటైర్డు డీఈవో మామిళ్ల వెంకటరంగయ్యగారి లోకనాథం పద్మశాలీ పేర్కొన్నారు. ఆదివారం పద్మశాలీయ కల్యాణ మండపంలో పద్మశాలీయ అభ్యుదయ సంఘం ఆధ్వర్యంలో ప్రతిభా పురస్కారాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 25 సంవత్సరాలుగా ప్రతిభా పురస్కారాలు అందజేయడం అభినందనీయమన్నారు. అనంతపురం మెడికల్ కళాశాల హెచ్‌వోడీ డాక్టర్ అవ్వారు వెంకటరంగస్వామి పద్మశాలీ మాట్లాడుతూ విద్యార్థులు ఓటమికి కుంగిపోకుండా ధైర్యంగా ముందుకు సాగాలన్నారు. పద్మశాలీయ అభ్యుదయ సంఘం అధ్యక్షుడు వద్ది నరసింహులు మాట్లాడుతూ 26 సంవత్సరాలుగా దాతల సహకారంతో ప్రజ్ఞా ప్రతిభా పురస్కారాలను అందజేస్తున్నామన్నారు. 24 మంది విద్యార్థులకు 2.72 లక్షల నగదు పురస్కారాలను అందజేశామన్నారు. 60 యేళ్లు దాటిన 12 మంది చేనేత కార్మికులను సత్కరించి ఆర్థికసాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సత్యప్రసాద్, ఆలిండియా పద్మశాలీయ సంఘం కార్యదర్శి నందం లక్ష్మణకుమార్, కర్నూలుజిల్లా అధ్యక్షుడు భీమునిపల్లె వెంకటసుబ్బయ్య, సంఘం నాయకులు సాధు అశోక్, చెన్నా చంద్రబాబు, వద్దినాగరాజు, అవ్వారి శ్రీనివాసులు, కోట సంజీవరాయుడు, జింకా శ్రీనివాసులు, బోగా ఆనంద్, జింకా సుబ్రహ్మణ్యం, అవ్వారు తాండవ కృష్ణ, పోలంకి వరదరాజులు, చెన్నా వెంకటసాయి క్రిష్ణ, బొర్రా మునిస్వామి తదితరులు పాల్గొన్నారు.

దండకారణ్యంలో మారణహోమం దారుణం

● ఆపరేషన్ కదార్‌ను నిలిపివేయాలి : ప్రజాసంఘాల ఐక్యవేదిక

ప్రొద్దుటూరు టౌన్, మే 19: దండకారణ్యంలో జరుగుతున్న మారణహోమాన్ని ప్రజాస్వామ్యవాదులు, రాజకీయ పార్టీలు ఖండించాలని విరసం రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు వరలక్ష్మి పేర్కొన్నారు. ఆదివారం ఎన్జీవో హోంలో దండకారణ్యంలో జరుగుతున్న ఆపరేషన్ కదార్‌ను నిలిపివేయాలని ప్రజాసంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అడవులలో ఉన్న ఖనిజ సంపదను కార్పొరేట్ సంస్థలకు అప్పనంగా కట్టబెట్టడానికి ప్రభుత్వం ప్రయత్నిస్తోందని విమర్శించారు. దీనిలో భాగంగానే అడవులలో నివశించే ఆదివాసీయులను తరిమివేయడానికి ఆపరేషన్ కదార్ చేపట్టారన్నారు. ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటి వరకు జరిగిన బూటకపు ఎన్‌కౌంటర్లలో సుమారు 115 మంది గిరిజనులు చనిపోయారన్నారు. చివరకు పసిపిల్లలు, వృద్ధులను కూడా చంపేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రక్షించవలసిన ప్రభుత్వమే డ్రోన్లు, హెలికాప్టర్ల ద్వారా కాల్పులు జరుపుతూ అడవుల్లో యుద్ధవాతావరణం సృష్టిస్తోందన్నారు. దండకారణ్యంలో సైనికబలగాలు మారణహోమం సృష్టిస్తున్నాయని విమర్శించారు. పర్యావరణాన్ని, సంస్కృతిని ప్రాణాలను ఫణంగా పెట్టి కాపాడుతున్న ఆదీవాసీయుల పోరాటానికి పౌరులు అండగా నిలువాలని కోరారు. దండకారణ్యంలో జరుగుతున్న హింసాకాండను నిలిపేసేలా ప్రజలు భారత రాష్ట్రపతికి లేఖలు రాయాలన్నారు. సమావేశంలో పౌరహక్కుల సంఘం రాష్ట్ర కార్యదర్శి వెంకటేశ్వర్లు, జిల్లా అధ్యక్షుడు సురేష్‌బాబు, వీకేఎస్ నాయకుడు శ్రీను, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి పీఎండీ నజీర్, సీపీఐ కార్యదర్శి సుబ్బరాయుడు, డీఎస్పీ జయరాం, ఆర్‌వీఎస్ సరిత, సీఎంఎస్ సరిత, న్యాయవాది దాదా, జహంగీర్, మురళి, రచయిత మహమ్మద్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వరలక్ష్మి

హెచ్‌ఐవీతో మరణించిన వారిని స్మరించుకోవాలి

బద్వేలు రూరల్, మే 19 : అంతర్జాతీయ ఎయిడ్స్ కొవ్వొత్తుల స్మారక దినోత్సవ సందర్భంగా పట్టణ ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి శ్రీనివాసులు ఆధ్వర్యంలోజిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల నుంచి నాలుగురోడ్ల కూడలి వరకు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎయిడ్స్‌తో మరణించిన వారిని స్మరించుకుంటూ వారి కుటుంబ సభ్యుల పట్ల ప్రేమ,సంఘీభావం తెలియజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసరు మురళీక్రిష్ణ, హెల్త్ ఎడ్యుకేటర్ వెంగయ్య, సూపర్‌వైజరు శివరామిరెడ్డి, ఐసీడీఎస్ కౌన్సిల ర్ శ్రీనివాసులు, స్వచ్ఛంద ఆరోగ్య కార్యకర్తలు, ఎఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

పోరుమామిళ్ల..: ఎయిడ్స్‌తో చనిపోయిన వారిని గుర్తు చేసుకుంటూ వారి పట్ల ప్రేమ, సంఘీభావం తెలియజేద్దామని కమ్యూనిటీహెల్త్ సెంటరు వైద్యులు శివక్రిష్ణ, రవి అన్నారు. ఆదివారం రాత్రి హెచ్‌ఐవీ ఎయిడ్స్‌తో చనిపోయిన వారిని గుర్తు చేసుకుంటూ కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. సాదు వెంటేశ్వర్లు, సచివాలయం, ఏఎస్‌ఎం, సిబ్బంది పాల్గొన్నారు.

మైదుకూరు..: అంతర్జాతీయ ఎయిడ్స్ కొవ్వొత్తుల స్మారక దినోత్సవం సందర్భంగా ఆదివారం రాత్రి మైదుకూరులో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఐసీటీసీ ఆధ్వర్యంలో ఈ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యకర్త ఎంవీ ప్రసాద్ మాట్లాడుతూ హెచ్‌ఐవీ, ఎయిడ్స్‌తో చనిపోయిన వారి ఆత్మకు శాంతి చేకూరాలని అంతర్జాతీయ స్థాయిలో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్యకర్తలు దర్బార్, అమీర్, సుజాత, రామలక్షుమ్మ, మాబుచాన్ పాల్గొన్నారు.



మైదుకూరులో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

ప్రొద్దుటూరు..: ఎయిడ్స్ వ్యాధితో మరణించిన వారి స్మారకార్థం వైద్య సిబ్బంది కొవ్వొత్తులతో నివాళులర్పించారు. ఆదివారం వాసవీసర్కిల్లో రాత్రి 7 గంటలకు ఎయిడ్స్ వ్యాధి గ్రస్తుల విషాధమరణాలకుగాను అంతర్జాతీయ స్మారక దినం జరిపారు. ఈ కార్యక్రమంలో కామనూరు వైద్యాధికారి డాక్టర్ హనీఫ్‌బాబా, డీపీయం శ్రీను, సూపర్‌వైజర్ వీపీ ప్రసాద్, చంద్రకళ, టీబీసూపర్‌వైజర్ హుస్సేన్ బాష, హెల్త్ అసిస్టెంట్ లక్ష్మీనారాయణ పాల్గొన్నారు

పచ్చిరొట్ట విత్తనాలకు పేర్లు నమోదు చేసుకోండి

చాపాడు, మే 19: మండలంలోని అన్ని గ్రామాలకు చెందిన రైతులు పచ్చిరొట్ట విత్తనాలకు పేర్లు నమోదు చేసుకోవాలని ఏవో మ్యాగీ తెలిపారు. 50 శాతం సబ్సిడీతో జీలుగ, జనుము విత్తనాలు ఇస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రభుత్వం మండలానికి జీలుగలు 650 క్వింటాళ్లు, జనుములు 35 క్వింటాళ్లు మంజూరు చేసినట్లు ఆమె చెప్పారు. జీలుగలు సబ్సిడీ పోను 10 కేజీల ప్యాకెట్ రూ. 440లకు, జనుములు 10 కేజీల ప్యాకెట్ రూ.670 లకు విక్రయిస్తున్నట్లు చెప్పారు. ఎకరాకు ఒక ప్యాకెట్ చొప్పున మూడు ప్యాకెట్లు మించకుండా ఇస్తామన్నారు. రైతులు ఆయా గ్రామ సచివాలయాల్లో సోమవారం నుంచి పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. ఆధార్‌కార్డులు,పట్టాదారు పాస్‌పుస్తకాలు, సెల్‌ఫోన్లు తీసుకుని రావాలన్నారు.

పేదలందరికీ ఇళ్లు, స్థలాలు సాధించేవరకు ఉద్యమిస్తాం

బద్వేలు, మే 19: బద్వేలులోని ప్రభుత్వ భూమిలో గుడిసెలు వేసుకున్న పేదలందరికీ ఇంటి పట్టాలు, పక్కాగృహాలు దక్కేవరకు ఉద్యమాలు చేపడతామని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి కె. ఆంజనేయులు పేర్కొన్నారు. స్థానిక సుందరయ్య భవన్‌లో పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి కార్యక్రమం రమణ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు అన్వేష్ సీపీఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్ , వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు శివకుమార్, జిల్లా నాయకులు వెంకటేష్, రామసుబ్బమ్మ తదితరులు పాల్గొన్నారు.

22 నుంచి వీరాంజనేయ స్వామి బ్రహ్మోత్సవాలు

మైదుకూరు, మే 19 : పట్టణ శివారులోని కొత్తపాళెంలో ఉన్న వీరాంజనేయ స్వామి ఆలయంలో ఈనెల 22 నుంచి 3 రోజుల పాటు స్వామివారి బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నారు. 22న ఉదయం స్వామివారికి గణపతి హోమం అభిషేకాలు కుంకుమార్చనలుచ అష్టోత్తర నామ పూజలు, 23న ప్రత్యేక పూజా కార్యక్రమాలతో భారీ అన్నదానం, రాత్రికి జెండా ఊరేగింపు, చెక్కభజనలు నిర్వహించ నున్నారు. అలాగే 24న రాష్ట్ర స్థాయి సీనియర్ విభాగంలో బండలాగు పోటీలు నిర్వహించి, గెలుపొందిన ఎద్దుల యజమానులకు నగదు బహుమతులు అందివ్వను న్నట్లు ఆలయ ధర్మకర్త చిట్టిబోయిన సుబ్బరాయుడు తెలిపారు.

నేటి నుంచి ఉరుసు

జమ్మలమడుగు, మే 19: జమ్మలమడుగు మున్సిపాలిటీ పరిధిలోని పలగాడి వీధిలో హజరత్ సయ్యద్‌షా బడే గౌస్‌పీరా ఖాద్రీ ఉరుసు సోమవారం నుంచి ప్రారంభం కానుంది. గౌషియా మకాన్ పీఠాధిపతి గౌస్‌పీరాఖాద్రీ ఇప్పటికే దర్గా ప్రాంగణంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఈనెల 10వ తేదీ నుంచి ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. 20 సోమవారం సర్వమత సమ్మేళనం, సర్వమత పెద్దలచే ప్రసంగం, 21న రాత్రి 7.30 గంటలకు సజ్జాదావారి ఇంటి నుంచి పకీర్ల మేళతాళతో గంధం బయల్దేరి పట్టణంలోని పలు వీధుల్లో ఊరేగింపుగా దర్గాకు చేరుకోవడం. 22న ఉరుసు, రాత్రి 7 గంటల నుంచి అన్నదానం జరుగుతుంది. 22, 23 తేదీల్లో రాత్రి 10 గంటలకు గొప్ప ఖవ్వాలీ ఏర్పాటు చేశారు.

ఘనంగా ప్రారంభమైన నట్టహర్‌షా వలి ఉరుసు



విద్యుద్దీపాలతో అలంకరించిన దర్గా

ఖాజీపేట, మే 19: మండల పరిధిలోని అగ్రహారంలో ఉన్న హజరత్ ఖాజా సయ్యద్ నట్టహర్‌షా వలి ఉరుసు ఆదివారం ఘనంగా ప్రారంభమైంది. హిందూ ముస్లింలు కలిసికట్టుగా జరుపుకునే ఈ ఉరుసు ఉత్సవాలు నాలుగు రోజులు నిర్వహించనున్నారు. అందులో భాగంగా ఆదివారం ప్రారంభించారు. సోమవారం గంధం ఖాజీపేట సిద్దారం కదిరుల్లా ఇంటి నుంచి బయల్దేరుతుంది. అయితే జెండా మాత్రం మంగళవారం సరన్‌ఖాన్‌పేట మసీదు నుంచి బయల్దేరుతుంది. భక్తులకు భారీ ఎత్తున అన్నదాన కార్యక్రమం కూడా నిర్వహించనున్నారు.

● **భారీ బందోబస్తు..:** ఎన్నికల కోడ్ ఉన్నందువలన ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా సీఐ రామాంజులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేయనున్నట్లు ఆయన తెలిపారు. వారు మాట్లాడుతూ గుంపులు గుంపులుగా ఉండి రాజకీయాలు చర్చించకుండా స్వామివారిని దర్శించుకుని వెళ్లాలన్నారు.

ఊరేగింపులు, ర్యాలీలకు అనుమతి లేదు : డీఎస్పీ

మైదుకూరు, మే 19 : సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియ పూర్తి అయ్యేవరకు ఎలాంటి ఊరేగింపులు, ర్యాలీలకు అనుమతి లేదని, 144, 30 సెక్షన్లు అమలు ఉంటుందని డీఎస్పీ వెంకటేసులు తెలిపారు. స్థానిక కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ జూన్ 6వ తేదీ వరకు అమలులో ఉంటుందని, అంత వరకు ఎలాంటి ఊరేగింపులు, ర్యాలీలు, నలుగురు మించి గుంపుగా ఉండకూడ దన్నారు. రాత్రి 9 గంటలకు వివిధ వ్యాపార సంస్థల న్నింటినీ మూసివేయాలని తెలిపారు. అలాగే అసాంఘిక శక్తుల పట్ల జాగ్రత్తగా ఉండాలని ఏమైనా సమాచారం తెలిసిన వెంటనే పోలీసుల దృష్టికి తీసుకరావాలని కోరారు. ఉల్లఘంనలు అతిక్రమిస్తే కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుం టామన్నారు.

ఉచిత వైద్యపరీక్షలు



వైద్య పరీక్షలు చేస్తున్న శ్రీనాథరెడ్డి

ప్రొద్దుటూరు క్రైం, మే 19 : లక్ష్య కార్డియాక్, లక్ష్య కంటి ఆసుపత్రిలో ఆదివారం రోగులకు ఉచితంగా పరీక్షలు నిర్వహించినట్లు ప్రముఖ వైద్యులు పాతకోట శ్రీనాథరెడ్డి తెలిపారు. తమ ఆసుపత్రిలో ప్రతినెల మూడో ఆదివారం ఉచితంగా గుండె, కంటి పరీక్షలు నిర్వహిస్తామని ఆయన తెలిపారు. 47 మంది రోగులకు పరీక్షలు నిర్వహించామని, 27 మందికి ఈసీజీ పరీక్షలు, పది మందికి స్కానింగ్ పరీక్షలు నిర్వహించినట్లు వైద్యులు తెలిపారు. 32 మంది రోగులకు ఉచితంగా కంటి పరీక్షలు చేసినట్లు డాక్టర్ హరిత తెలిపారు. వీరికి తగు చికిత్స, సూచనలు ఇవ్వడం జరిగిందని డాక్టర్ శ్రీనాథరెడ్డి తెలిపారు.

పోలీసుల హెచ్చరికలు బేఖాతర్..!

● పట్టణంలో అమలుకాని 144 సెక్షన్ ● రోడ్లపై గుంపులుగా జనాలు

జమ్మలమడుగు, మే 19: జమ్మలమడుగు డివిజన్ కేంద్రంలో మున్సిపాలిటీ పరిధిలో 144 సెక్షన్ అమలులో ఉంది. ఈనెల 13వ తేదీ జమ్మలమడుగులో 116, 117 పోలింగ్ కేంద్రాల వద్ద గొడవలు, రాళ్లు రువ్వుకోవడం జరిగింది. అయితే పోలీసు అధికారులు జమ్మలమడుగులో 144 సెక్షన్ అమలులో ఉందని కడప నుంచి వజ్ర వాహనం తెప్పించి పాత బస్టాండులో ప్రదర్శనగా పెట్టడం, పోలీసు బలగాలు పట్టణంలో ప్రదర్శనగా తిరగడం జరుగుతోంది. అయితే పోలీసుల హెచ్చరికలు దుకాణదారులు, కొందరు ప్రజలు పట్టించుకోవడంలేదు. ప్రధానంగా జమ్మలమడుగు మండలంలోని మోరగుడి మూడు రోడ్ల కూడలి నుంచి రోడ్లకు ఇరువైపుల దుకాణాల వద్ద గుంపులు, గుంపులుగా నిలబడి ఏ గ్రామంలో ఏయే ప్రాంతాల్లో పోలింగ్ ప్రక్రియ ఎలా జరిగింది. ఏయే గ్రామాల్లో ఏయే పార్టీకి మెజార్టీ ఎంత జరిగిన సమస్యలపై, డబ్బుల పంపకాలపై ఎక్కడ చూసినా చర్చలు జరుగుతూనే ఉన్నాయి. అయితే వాటినన్నింటిని దృష్టిలో ఉంచుకుని డీఎస్పీ యశ్వంత్, వారి సిబ్బంది 144 సెక్షన్ అమలులో ఉందని హెచ్చరికలు చేస్తున్నా కొందరికి అవి పట్టడంలేదు. చర్చలు చేసుకుంటూ వాదోపవాదాలు చేసుకున్నా గొడవలు జరిగే అవకాశం ఉంటుందని ఆందోళన చెందుతున్నారు. ప్రధానంగా టీ అంగళ్ల వద్ద నలుగురు నుంచి అయిదుగురికి మించి ఒకే గుంపుగా నిలబడరాదని ఆదేశాలున్నాయి. అయితే జమ్మలమడుగులోని పాత బస్టాండు టీ దుకాణాల వద్ద, బార్‌షాపుల వద్ద, మద్యం దుకాణాల వద్ద రోడ్లపై ట్రాఫిక్‌కు అడ్డంగా ద్విచక్ర వాహనాలు నిలిపి గుంపులుగా నిలబడి చర్చించుకుంటున్నారు. దీన్ని బట్టి చూస్తే జమ్మలమడుగులో 144 సెక్షన్ అమలులో ఉందని అంటే ఇలా గుంపులుగా నిలబడి ఉండడమేనా అనే అనుమానం ప్రజల్లో ఉంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు పట్టణంలో అప్రమత్తం చేసి ఎక్కడ ఏ దుకాణాల వద్ద గుంపులుగా నిలబడినా చర్యలు తీసుకోవాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తూ ఆందోళన చెందుతున్నారు.

